# వార్త

ఆదివారం

25 డిసెంబరు, 2022

# G20

# జి 20 సారథి భారత్



తారాతీరం

# 'ఏ మాస్టర్ పీస్'లో అషురెడ్డి



బిగ్‌బాస్ బ్యూటీ అషురెడ్డి లక్కీ ఛాన్స్ కొట్టేసింది. సిల్వర్ స్క్రీన్‌పై హీరోయిన్‌గా మెరిసే అవకాశం దక్కించుకుంది. టాలీవుడ్ యువ నటుడు అరవింద్ కృష్ణ ఇటీవలే కొత్త సినిమాను ప్రకటించాడు. 'ఏ మాస్టర్ పీస్' టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది. సుకు పూర్వజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా అషు రెడ్డిని సెలెక్ట్ చేశారు. ఈ సినిమాను కంద్రగుల శ్రీకాంత్ నిర్మించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం టైటిల్ లుక్ సినిమాపై ఆసక్తి పెంచుతోంది. 2018లో అషు రెడ్డి చివరిసారి వెండితెరపై కనిపించింది. నితిన్, మేఘా ఆకాశ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఛల్ మోహనరంగ' సినిమాలో ఆమె ఓ పాత్రలో కనిపించింది.

# డబ్బింగ్ దశలో 'శబరి'



**వరలక్ష్మి** శరత్‌కుమార్ విభిన్నమైన, విలక్షణమైన పాత్రలను చేస్తూ వెళుతోంది. ముఖ్యమైన, తాను ప్రధాన పాత్రగా ఆమె 'శబరి' సినిమా చేసింది. ఒక డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందింది. రొమాంటిక్ టచ్ ఉన్న థ్రిల్లర్ సినిమా ఇది. మహేంద్రనాథ్ నిర్మించిన ఈ సినిమాకి అరుణ్ కుమార్ దర్శకత్వం వహించాడు. షూటింగు కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా, ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్రమాన్ని జరుపుకుంటోంది. తాను పోషించిన పాత్రకి వరలక్ష్మి శరత్ కుమార్ డబ్బింగ్ చెబుతోంది. తెలుగు, తమిళ భాషల్లో వరలక్ష్మి శరత్ కుమార్‌కి మంచి క్రేజ్ వుంది. ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయనున్నారు. గోపీసుందర్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రంలో గణేశ్ వెంకట్రామన్, మైమ్ గోపీ ముఖ్య పాత్రలు పోషించారు.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
25 డిసెంబరు, 2022

## మంచి ముత్యాలు

పొగడ్త సుగంధం వంటిది. దాన్ని పీల్చేందుకే ప్రయత్నించాలి కాని. మింగేందుకు కాదు.

- ఆర్.ఎస్.సూర్జీత్

# విషయ విశేషం

పూల తివాచీ... 4

'సంఘీ'భావం....5
అంతులేకుండా పోతున్న అవినీతి

రక్షకుడు ఉదయించెను....6

కవర్ స్టోరీ..8
జి20 సారధి భారత్

ఈవారం కవిత్వం..12
విరిసిన మరుమల్లెలు

సంపదని సృష్టిస్తున్న వెదురు..14

మహిళలకు పెద్ద పీట వేస్తున్న ప్రకటనలు..18

కథ.. 20
కుక్కతోక

సాహిత్యం.. 23
తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ..

మనలోనే మంచోడూ, చెడ్డోడూ..26

స్నేహబంధం.. .30

ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..




# స్పెషల్ న్యూస్

## ఆకలిగా ఉన్నప్పుడు కోపం వస్తుందా?

"నాకు కోపం వస్తోంది" అని ఎవరైనా అంటే వాళ్లను బాగా గమనించండి. ఆ తరువాత "ఆకలిగా ఉందా?" అని అడగండి. మీకు వాళ్ల కోపానికి కారణం కచ్చితంగా తెలుస్తుంది.. అంటున్నారు. లండన్‌లోని ఆంగ్లియా రస్కిన్ యూనివర్సిటీ, ఆస్ట్రియాలోని కార్ల్ ల్యాండ్‌స్టీనర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు చెందిన పరిశోధకులు. ఆకలితో వచ్చే ఈ కోపాన్ని హ్యాంగ్రీ అని పిలుస్తున్నారు. ఆకలి వేయడం వల్ల కోపం, చిరాకు బాగా పెరిగిపోతుందని, వంద మందిలో సుమారు నలభై మందికి కోపం రావడానికి కారణం ఆకలేననీ వాళ్ల అధ్యయనంలో తేలిందట. భోజనానికి-భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే రక్తంలో చక్కెర నిల్వలు తగ్గిపోతాయి. దాంతో ఒత్తిడిని పెంచే కార్టిసాల్, కోపాన్ని కలిగించే అడ్రినలిన్ హార్మోన్ల శాతం పెరుగుతుంది. కనుకనే ఆకలి వేసినప్పుడు కోపం వస్తుందం టున్నారు. ఈ విధంగా వచ్చిన హ్యాంగ్రీ భావోద్వేగాలని, ప్రవర్తనని ప్రభావితం చేస్తుందని అంటున్నారు. ఆ సమయంలో మెదడు చురుకుదనం తగ్గడంతో పాటు స్వీయ నియంత్రణ కూడా ఉండదట. కనుక అలాంటి సమయంలో పీచు ఎక్కువగా ఉండే పోషకాహారం తీసుకుంటే ఆకలి, తద్వారా కోపమూ తగ్గుతాయంటున్నారు సదరు పరిశోధకులు.

### నీటి చెంతకు వెళుతున్నారా?

నదీ ప్రవాహాల్నీ, సాగరతీరాల్నీ, సెలయేళ్లనీ తరచుగా సందర్శిం చేవాళ్లు మానసిక సమస్యలకు దూరంగా ఉంటారట. ముఖ్యంగా నీళ్లకు సమీపంలో నివసించేవాళ్లలో ఒకలాంటి ప్రశాంతత కనిపిస్తుంది. ఎందుకంటే చుట్టుపక్కల వాతావరణం పచ్చగానో, నీలంగానో ఉంటే ఆ ప్రదేశంలో జీవించే వాళ్లలో మానసిక అలజడి, ఒత్తిడి తక్కువగా ఉంటున్నట్లు గతంలోనే గుర్తించారు లండన్ కింగ్స్ కాలేజ్ పరిశోధకులు. అయితే నీలాకాశాన్ని చూస్తూ నీళ్లకు సమీపంలో జీవిస్తున్న వాళ్లలో మానసిక సమస్యలు మరింత తక్కువగా ఉంటున్నాయట. ఇందుకోసం వీళ్లు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నవాళ్లని ఎంపిక చేసి కొంత కాలం నీళ్లకు సమీపంలో నివసించేలా చేసినప్పుడు వాళ్లలో మెరుగైన ఫలితాలు వచ్చాయట. అంతేకాదు.. మిగిలిన వాళ్లతో పోలిస్తే నదీ తీరాల్లోనూ సముద్ర తీరాల్లోనూ జీవిస్తూ ఆయా ప్రాంతాల్లో తరచూ పర్యటించేవాళ్లు ఎక్కువ ఆనందంగా ఉంటున్నారట.





# పూల తివాచీ










అదొక **800** ఎకరాల తోట. అక్కడన్నీ పూల మొక్కలే. ఒక్కోకాలంలో ఒక్కోరకం విచ్చుకుంటూ చూడడానికి రెండు కళ్లు చాలవన్నట్టుగా చేస్తాయి. జపాన్‌లోని 'హిటాచీసీసైడ్ పార్కు' లో ఎంత లేదన్నా రెండు వందల రకాలకు పైగా పూల తివాచీలను చూసిన అనుభూతి కలుగుతుంది. జులై, ఆగస్టులో ఆకుపచ్చగా ఉండే ఆకులు అక్టోబరు కల్లా గులాబీ, ఆపై ఎరుపు రంగులోకి మారిపోతాయి. అదే మార్చి ఏప్రిల్ కాలంలో ఇక్కడికి వెళితే నీలాకాశమే నేలంతా పరుచుకున్నట్టు గాలి పూల సంద్రం కనిపిస్తుంది. ఇలా అక్కడ ఏడాదంతా రంగులమయమే. నడక, సైక్లింగ్ దారుల్లోనే పార్కులో విహరించాలి.



# 'సంఘీ' భావం



## అంతులేకుండా పోతున్న అవినీతి

సమాజంలో అవినీతి రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రతి అంశం లోను అవినీతి ముడిపడి ఉంటోంది. ప్రపంచ యుద్ధం వల్ల కలిగే నష్టం కంటే అవినీతి వల్ల జరుగుతున్న కీడు ప్రభావం ఎక్కువగా ఉంటుందని న్యాయస్థానాలు వ్యాఖ్యానిసున్నాయి. అవినీతికి పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని న్యాయస్థానాలు పేర్కొంటు న్నాయి. అయితే అందుకు అనువైన చట్టాలు లేకపోవడంతో అవినీతిపరులు సునాయసంగా కేసుల నుంచి తప్పించుకుని స్వేచ్ఛ గా తిరుగుతున్నారు. ప్రభుత్వ శాఖల కంటే రాజకీయాల్లో అవినీతి ఎక్కువగా ఉందని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ జీవితం గడుపుతున్న అనేక మంది రాజకీయాల్లోకి వచ్చి కేవలం నాలుగైదు సంవత్సరాల్లోనే కోట్లకు పడగెత్తిన దాఖలాలు అనేకం ఉన్నాయి. అవినీతికి పాల్పడే అధికారులకు, వారికి సహకరించే వ్యక్తులకు కూడా చట్టంలో నేరస్తులుగా గుర్తించాలని స్పష్టంగా ఉంది. గతం లో ఎసిబీ, సిబిఐ అధికారులు అవినీతి అధికారులను పట్టుకున్న సందర్భంలో కేవలం కేసులు మాత్రమే పెట్టేవారు. అయితే సుమారు 12 ఏళ్ల క్రితం చట్టంలో సవరణలు చేసి అవినీతి సొమ్ముతో దొరికిన అధికారిని అప్పటికప్పుడు అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెడుతున్నారు. ఈ విధానం వల్ల అవినీతి అధికారులు కొంత భయం కలిగింది. అయితే అరెస్ట్ కావడం వెంటనే బెయిల్‌పై బయటకు రావడం జరిగిపోతోంది. అంతేకాకుండా ఈ కేసులు కోర్టులో నెగ్గకపోవడంతో అవినీతి అధికారులు తిరిగి విధుల్లో చేరుతున్నారు. అవినీతి అధికారులపై కేసులు రెండు రకాలుగా ఉంటాయి. ఏదైనా పనిచేసేందుకు ఎదుటి వ్యక్తి నుంచి కొంత సొమ్ము ఆశించి అది తీసుకుంటున్న సమయంలో ఎసిబి అధికారు లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటారు. అదేవిధంగా ఏదైనా అధికారి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు సమాచారం అందితే అతని ఇంటిపైనా, బంధువుల ఇళ్లలో సోదాలు చేసి ఆస్తుల వివ రాలు లెక్కిస్తారు. నెలసరి తీసుకునే జీతంతో ఈ ఆస్తులను పోల్చి చూస్తారు. ఆదాయం కంటే ఆస్తులు ఎక్కువగా ఉంటే కేసులు పెడతారు. ఈ రెండు కేసుల్లో మొదట్లో విస్తృత ప్రచారం ఉంటుం ది. అయితే కేసు కోర్టుకు వెళ్లిన తరువాత ఈ విషయం గురించి మీడియా పట్టించుకోవడం మానేస్తుంది. అదేవిధంగా చాలా మంది ఎసిబి అధికారులు కోర్టులో కేసు దాఖలు అయిన తరువాత సాక్ష్యా లను ప్రవేశపెట్టడంపై అంతగా ఆసక్తి చూపించరు. ఈ విషయంలో అనేక కారణాలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి వత్తిడి రావడం, ఏసిబీకి చెందిన కొందరు సిబ్బంది అభియోగం మోపిన అధికారితో కుమ్మక్కుకావడం, సిబ్బంది కొరత కారణంగా కోర్టు కేసును ఫాలో కాలేకపోవడం. కోర్టుల్లో కూడా ఎక్కువ కేసులు ఉండటంతో విచారణ సంవత్సరాల తరబడి కొన సాగుతుంది. సర్వీసు రూల్స్ ప్రకారం అంతకాలం పాటు అధికారులను సస్పెండ్‌లో పెట్టే అవకాశం ఉండదు. దీనితో వారు తిరిగి విధుల్లో చేరి మళ్లీ తమ వ్యవహారాలు కొనసాగిస్తారు. చాలా సందర్భాల్లో అధికారి అవినీతిపై ఏసీబీకి ఫిర్యాదు చేసి లంచం మొత్తం ఇస్తూ పట్టించిన బాధితులు ఆ తరువాత పోలీసులకు సహకరించరు. వారి కోపం చల్లారిపోవడమో, లేకపోతే అరెస్ట్ చేయించాం ఇక చాలు అన్న భావన వారిలో రావడం జరుగుతుంది. మరోపక్క వారు దైనందిన జీవితాల్లో బిజీ కావడంతో కోర్టుకు హాజరుకాకపోవడంతో కేసులు కొట్టేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. విచిత్రం ఏమిటంటే అవినీతి కేసులు కోర్టులో 95 శాతం వరకు వీగిపోతుంటాయి. శిక్షలు పడే కేసులు చాలా తక్కువగా ఉంటాయి. అదేవిధంగా పోలీసు శాఖలో పనిచేసే వారినే ఏసీబీ విభాగానికి తీసుకుంటూ ఉంటారు. గతంలో ఈ విభాగానికి సిబ్బందిని నియమించే సమయంలో అనేక అంశాలను పరిశీలించే వారు. ప్రస్తుతం ఎలాంటి పరిశీలన లేకుండా ఏసీబీ సిబ్బంది నియామకం జరుగు తోంది. ఈ విభాగానికి వచ్చాక కొందరు సిబ్బంది అవినీతికి పాల్పడుతూ సస్పెండ్ అయిన సందర్భాలు ఉన్నాయి. కొందరు ఏసీబీలో విధులు నిర్వహించడం పట్ల ఆసక్తి ఉండదు. లా అండ్ ఆర్డర్ విభాగానికి వెళ్లిపోవడానికి శ్రద్ధ చూపిస్తారు. దీనితో వీరు ఇక్కడ పూర్తిస్థాయిలో విధులు నిర్వహించేందుకు ఆసక్తి చూపిం చరు. కేసులు కోర్టులో ఉన్న సమయంలో వీరు బదిలీ కావడంతో వాటిని పట్టించుకునే వారు ఉండరు. కేసులు ఎక్కువ కాలం కోర్టులో విచారణ కొనసాగడంతో అవినీతి అధికారులు తప్పించు కునే అవకాశాలు అధికంగా ఉంటాయి. అవినీతిని అంతమొందిం చాలంటే ప్రస్తుతం ఉన్న చట్టాలు ఏమాత్రం సరిపోవడం లేదు. కీసర మండలంలో ఒక అధికారి ఏకంగా కోటీ 10 లక్షల రూపా యలు తీసుకుంటూ పట్టుపడ్డారు. మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్ కోటీ 20 లక్షలు రూపాయలు లంచం తీసుకుంటూ పట్టుపడ్డారు. మరో మహిళా అధికారి అవినీతి కేసులో అరెస్ట్ కావడంతో మనస్తాపం చెందిన ఆమె భర్త, యూనివర్శిటీ ప్రొఫెసర్ ఆత్మహత్య చేసుకుని చనిపోయారు. జైలు నుంచి బెయిల్‌పై వచ్చి భర్త అంత్య క్రియల్లో పాల్గొన్న మహిళా అధికారిణి కూడా ఆ తరువాత ఆత్మహత్యకు పాల్పడ్డారు. హయాత్‌నగర్‌లో ఒక మహిళా తాహసి ల్దార్‌ను బాధితుడు ఆఫీసులోనే పెట్రోల్ పోసి తగులబెట్టాడు. ఈ ఘటనలో తహసిల్దార్, బాధితుడితో పాటు అక్కడున్న డ్రైవర్ కూడా మృతి చెందడం సంచలనం కలిగించింది. ఇలాంటి ఘటన లు ఎన్ని జరుగుతున్నా ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైలు కదలా లంటే లంచం ఇవ్వకతప్పని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితులను నిర్మూలించేందుకు సరైన అధ్యయనం జరగడం లేదు. చట్టాల్లో మార్పులు తీసుకురావాలి. వ్యవస్థలో, ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలి. అవినీతికి మార్గం చూపించే లోపాలను సరిదిద్దాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు లభిస్తాయి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# రక్షకుడు ఉదయించెను..

**'యూదుల** రాజుగా పుట్టినవాడెక్కడ నున్నాడు? తూర్పుదిక్కున మేము ఆయన నక్షత్రము చూచి, ఆయనను పూజింపవచ్చితిమని చెప్పిరి' (మత్తయి 2:2), 'ఆమె యొక కుమారుని కనును, తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు' (రక్షుడని) అను పేరు పెట్టుదువనెను' (మత్తయి 1:21).

ప్రపంచవ్యాప్తంగా 'క్రిస్మస్' ఆరాధన జరుగుతున్నాయి. క్రైస్తవ దేశాలు దాదాపు డిసెంబరు మాసమంతా క్రిస్మస్ ఉత్సవాలను జరుపుకుంటాయి. మన దేశంలోనూ ఈ ఉత్సవాలు సందడిగా జరుగుతాయి. క్రిస్మస్ పండుగ అంటే హంగులు, ఆర్భాటాలతోను, ఖరీదైన దుస్తుల్ని ధరించడం, పిండివంటల్ని చేసుకోవడం, అల్లరితోకూడిన ఆటపాటలతో జరుపుకోవడం కాదుకానీ, యేసుక్రీస్తును సొంతరక్షకుడిగా అంగీకరించి, ఆరాధించడంలోనే అసలైన క్రిస్మస్ పండుగ ఆనందం దాగి వుంది. కొత్తబట్టల్ని ధరించుకోవడం, పిండివంటల్ని చేసుకోవడం, ఇంటిని, చర్చినీ డెకరేషన్ చేసుకోవడంలో తప్పులేదు. ఎవరి స్తోమతకు తగినంత వారు జరుపుకోవడంలో దేవుడి దృష్టిలో కూడా పాపం కాదు. ప్రభువు మనకోసం ఈలోకానికి వచ్చాడు కాబట్టి తప్పనిసరిగా ఆనందంతో, ఉత్సాహంగా జరుపుకోవాల్సిందే. ఎందుకంటే ఆయన జన్మించకపోయివుంటే మరణించే వాడు కాదు. ఆయన మరణం లేకపోతే మనకూ నిరీక్షణ వుండేది కాదు, దేవుడితో సహవాసం ఉండేది కూడా కాదు. అయితే ప్రభువు ఈలోకానికి ఎందుకొచ్చాడో, ఎవరి నిమిత్తం 'సిలువ'లో ప్రాణం పెట్టాడో ఈ మర్మాలను ఏమాత్రం అర్థం చేసుకోకుండా, రక్షణ అనే గొప్ప భాగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ, పండుగ సీజన్ వచ్చేసరికి ఆర్భాటాలతో, అల్లరితో కూడిన ఆటపాటలతో జరుపుకోవడమే విచారకరం. అలాగని అందరూ ఇదే ధోరణిలో జరుపుకుంటున్నారని కాదు. క్రిస్మస్ సీజన్‌లో దేవుడికి మహిమకరంగా జరుపుకోవాలి. సరే ప్రభువు జన్మించిన సందర్భాన్ని గమనిద్దాం.

'అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను, ఆయన స్త్రీయందు పుట్టి మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడియున్నవారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను' (గలతీ 4:4). కాలం పూర్తి అయిన తర్వాత 2022 సంవత్సరాల క్రితం ఆయన భూలోకంలో కన్యక అయిన మరియకు జన్మించాడు.



పరిశుద్ధాత్మ ద్వారా మరియ గర్భం ధరించింది. పరిశుద్ధిగా జన్మించాడు, యూదుల రాజుగా పుట్టాడు. అందుకే ఆయనను పూజించేందుకు తూర్పుదేశం నుంచి జ్ఞానులు వచ్చారు.

## జ్ఞానులు పూజించిన విధానం

'ఇదిగో తూర్పుదేశమున వారు చూచిన నక్షత్రము ఆ శిశువు ఉండిన చోటికి మీదుగా వచ్చి నిలుచువరకు వారికి

ముందుగా నడిచెను. వారు ఆ నక్షత్రమును చూచి, అత్యానందభరితులై యింటిలోనికి వచ్చి, తల్లియైన మరియను ఆ శిశువును చూచి, సాగిలపడి, ఆయనను, పూజించి, తమ పెట్టెలు విప్పి, బంగారము, సాంబ్రాణిని బోళమును కానుకలుగా ఆయనకు సమర్పించిరి' (మత్తయి 2:9,10,11). ఈ జ్ఞానులు చాలాదూరం నుంచి ప్రయాణం చేసి, వచ్చి శిశువైన యేసును చూచి, ఆనందంగా ప్రభువును పూజించారు. లోకరక్షణ కోసం యేసు జన్మించాడని ఆనందంతో ఉప్పొంగి పోతూ, ప్రభువును ఆరాధించిన విధానం శ్రేష్ఠమైనది.



### గొర్రెల కాపరుల ఆరాధన

'ఆదేశములో కొందరు గొఱ్ఱెల కాపరులు పొలములో ఉండి రాత్రివేళ తమ మందను కాచుకొనుచుండగా! ప్రభువు దూత వారియొద్దకు వచ్చి నిలిచెను. ప్రభువు మహిమ వారిచుట్టు ప్రకాశించినందున, వారు మిక్కిలి భయపడిరి. అయితే ఆ దూత భయపడకుడి, ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహాసంతోషకరమైన సువార్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీకొరకు పుట్టియున్నాడు, ఈయన ప్రభువైన క్రీస్తు' (లూకా 2:6-11). 'ఆ దూతలు తమయొద్దనుండి పరలోకమునకు వెళ్లిన తరువాత ఆ గొఱ్ఱెల కాపరులు-జరిగిన యీ కార్యమును ప్రభువు మనకు తెలియజేయించియున్నాడు, మనము బేత్లెహేమువరకు వెళ్లి చూతము రండని యొకనితో నొకడు చెప్పుకొని....త్వరగా వెళ్లి, మరియను యోసేపును తొట్టిలో పండుకొనియున్న శిశువును చూచిరి.. తాము విన్నవాటిని కన్నవాటినన్నిటిని గూర్చి దేవుని మహిమపరచుచు స్తోత్రముచేయుచు తిరిగి వెళ్లిరి' (లూకా 2:15-20). విద్యలేని గొర్రెల కాపరులు శిశువైన యేసుని పూజించారు. తర్వాత ఎలిజబేతు, జెకర్యా, మరియ, సుమెయోను, అన్న అనే ప్రవక్తిని వీరంతా యేసుప్రభువు జన్మించినందుకు ఆరాధించారు, పూజించారు. క్రిస్మస్ అంటే క్రైస్ట్+మాస్ దేవుడిని ఆరాధించడం అనేది అర్థం చేసుకోవాలి. మనం లేఖనాలను సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రభువును ఆరాధించకుండా వుండలేం.

### క్రిస్మస్ స్టార్

యేసుప్రభువు జన్మించిన తర్వాత తూర్పుదేశపు జ్ఞానులను నక్షత్రము యేసుప్రభువు వద్దకు నడిపించింది. నక్షత్రమే వారికి దారిని చూపించింది. అందుకే ఈ సీజన్‌లో క్రిస్మస్ స్టార్‌కు ఎక్కడలేని డిమాండ్ ఉంటుంది. నేటి ఆధునిక కాలంలో కూడా ఈ స్టార్ క్రైస్తవ గృహాలను ప్రభువు విమోచించిన గృహంగా లోకానికి చాటిచెప్పేలా ఉంటుంది.

### శాంటాక్లాజ్ హంగామాకు స్వస్తిపలకాలి

మనల్ని చీకటి నుంచి వెలుగులోనికి నడిపేందుకు ప్రభువు 2022 సంవత్సరాల క్రితం బేత్లెహేంలో జన్మించాడు. మనల్ని రక్షించిన ప్రభువును వదిలేసి, పేదలకు కానులను ఇచ్చేందుకు వచ్చిన శాంటాక్లాజ్ వెంట పడుతున్నారు. శాంటాక్లాజ్ ఒక మానవతావాది. క్రైస్తవ దేశాలు పేదలు కూడా క్రిస్మస్ ఆనందంలో భాగస్తులుగా చేసేందుకు నవంబరు మాసం నుంచి ధనవంతుల నుంచి, మానవతావాదుల నుంచి కానుకలను సేకరించి, వాటిని ఇతర దేశాలకు పంపే వ్యక్తి శాంట్లాక్లాజ్. ప్రత్యేకంగా అనాథ పిల్లలకు ఈ కానుకలను పంపుతాడు కాబట్టి, పిల్లలు ఆయనను తమ ఆత్మీయతాతగా భావించి, కేరింతలాడుతారు. కాబట్టి ఆయనకు ఎంత ప్రాధాన్యత ఇవ్వాలో అంతే ఇవ్వాలి. అంతవరకే శాంటాక్లాజ్‌ను చూడాలి. అల్లరితో కూడిన ఆటపాటలకూ కూడా స్వస్తిపలకాలి. మన ఆరాధన లోకమర్యాదలను అనుసరించేదిలా ఉండకూడదు. బైబిల్‌లో భక్తులు ఏవిధంగా ప్రభువును ఆరాధించారో వారిని ఆదర్శంగా తీసుకుని, ఆయన సన్నిధికి చేరుదాం. ఈ సీజన్‌లోనైనా ప్రభువును మనస్ఫూర్తిగా హృదయంలో చేర్చుకుని, ఆయనను మాత్రమే ఆరాధిస్తే అంతకుమించిన ఆనందం దేవుడికి మరొకటి లేదు. తన బిడ్డలను తనను గుర్తించి, సేవించడమే దేవుడు మననుంచి కోరే ఏకైక ఆజ్ఞ. అదే మనల్ని పరలోకానికి చేరుస్తుంది. హ్యాపీ క్రిస్మస్..

**- పి.వాణిపుష్ప**





# జి20 సారథి భారత్

కవర్ స్టోరీ

రుద్రరాజు శ్రీనివాసరాజు

**అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ, అగ్రరాజ్యాల మధ్య సహకారాన్ని పెంపొందించి ప్రపంచ పురోగతికి కృషి చేస్తున్న 20 దేశాల కలయికే జి-20.**

**1990** దశకంలో ప్రారంభమై ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన 20 దేశాల సమష్టి వేదికగా ఆవిర్భవించిన గ్రూప్ ఆఫ్ 20(జి-20). 1999లో కేవలం ఆర్థిక మంత్రుల, బ్యాంకర్ల వేదికగానే ఇది ఏర్పడింది. 2008లో మాంద్యం భూతం ప్రపంచాన్ని భయపెట్టిన తర్వాత అవసరాలు మారాయి. ఈ నేపథ్యంలో ఇది దేశాధినేతల వేదికగా రూపాంతరం చెందింది. దీనిలో 19 దేశాలు, వాటికి తోడుగా 27 ఐరోపా దేశాలన్నింటి సమూహంగా యూరోపియన్ యూనియన్‌తో 20 దేశాలు ఒకే బృందంగా రూపుదిద్దుకొంది. దేశాల అభివృద్ధికి, రక్షణకు, ప్రపంచ భౌగోళిక రాజకీయాలను నియంత్రించడానికి ప్రపంచ దేశాల్లో ఆర్థిక స్థిరత్వం నెలకొల్పడమే ప్రధాన లక్ష్యంగా ప్రపంచంలో వివిధ దేశాలు కలిసి నిర్దిష్ట లక్ష్యాల సాధనకై ఏర్పాటు చేసుకున్న కూటమి ఇది. ప్రపంచ వ్యాప్తంగా విభిన్న లక్ష్యాలతో గతంలో అనేక అంతర్జాతీయ కూటములు ఏర్పడినప్పటికీ వీటన్నింటిలో అత్యంత శక్తిమంతమైంది మాత్రం జి-20 గ్రూపుగానే చెప్పవచ్చు. ఎందుకంటే ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తిలో ఈ కూటమి సభ్య దేశాల వాటా 80 శాతం కాగా, ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం ఈ దేశాలదే. ఇక జనాభారీత్యా చూస్తే దాదాపు మూడింట రెండు వంతుల మంది ఈ దేశాల్లోనే నివసిస్తున్నారు. ప్రపంచంలోని 20 భారీ ఆర్థిక వ్యవస్థలు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వాల అధినేతలు ఒక్కచోట కలిసి చర్చించుకునే బృహత్తర వేదిక ఇది. సంక్షిప్తంగా చెప్పాలంటే అంతర్జాతీయ విధానాల పరంగా జి-20 ప్రపంచంపై బలమైన రాజకీయ ప్రభావం చూపే కూటమి అని అనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఎందుకంటే ప్రపంచంలోని బలమైన ఆర్థిక వ్యవస్థలు మొత్తం మనకు ఈ వేదికపైనే కనిపిస్తాయి. ఇక్కడ తీసుకొనే నిర్ణయాలకు అంతర్జాతీయంగా చట్టబద్ధత లేకపోయినా ప్రపంచం మొత్తాన్ని ఆ నిర్ణయాలు ప్రభావితం చేస్తాయని మాత్రం చెప్పగలం.

## సభ్యదేశాలు

అర్జెంటీనా, బ్రెజిల్, చైనా, జర్మనీ, ఇండోనేషియా, జపాన్, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్సు, ఇండియా, ఇటలీ, మెక్సికో, దక్షిణ కొరియా, రష్యా, టర్కీ, అమెరికా, దక్షిణ ఆఫ్రికా, సౌదీ అరేబియా, బ్రిటన్ వంటి 19 దేశాలు, 27 దేశాల ఉమ్మడిగా ఏర్పాటు చేసుకున్న యూరోపియన్ యూనియన్ మొదలైనవి ఉంటాయి. ఈ దేశాల మధ్య ఆర్థిక సహకారం పెంపొందించటం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సుస్థిరపరచాలనుక్ను సంకల్పంతో ఏర్పాటు చేసుకున్న అంతర్ ప్రభుత్వ వేదిక.

ప్రపంచ దేశాలను ఆర్థిక సంక్షోభం నుండి బయట పడవేయటానికి అవసరమైన ఉమ్మడి ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా పురుడు పోసుకున్న బలీయ కూటమి జి-20. అయితే 2008లో తలెత్తిన ప్రపంచ ఆర్థిక సంక్షోభంతో ప్రపంచ ఆర్థిక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. బ్యాంకులు కుప్పకూలటం, నిరుద్యోగం పెరగటం, వేతనాల్లో మాంద్యం నెలకొనటం వంటి పరిణామాలో జి-20 సంస్థ ఆయా దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులకు ఒక అత్యవసర మండలిగా మారిపోయింది.

ప్రస్తుతం జి-20 సమావేశాలకు అధ్యక్షులు, ప్రధానమంత్రులు తప్పనిసరిగా హాజరవుతున్నారు. మిగిలిన కూటములతో పోలిస్తే దీనికి అధిక ప్రాధాన్యత ఉంది. ఆరంభంలో ఈ కూటమి సమావేశాలకు సభ్య దేశాల ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకులు గవర్నర్లు సమావేశమై సంక్షోభాన్ని పరస్పర సహకారంతో ఎదుర్కొందామని తీర్మానించారు. అప్పటినుంచి ప్రతీ సంవత్సరం జి-20 ప్రతినిధులు సమావేశమై ప్రధాన అధినేతలు సంవత్సరానికి ఒకసారి సమావేశమైతే, ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకుల గవర్నర్లు రెండు సార్లు సమావేశమై అంతర్జాతీయ ఆర్థిక సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకురావడం ఆరంభించారు. జి20 దేశాల అధినేతలు సమావేశమయ్యే ప్రధాన సమావేశాలు కాకుండా ఏడాది మొత్తంలో వేర్వేరు సమావేశాలు కూడా జరుగుతూ ఉంటాయి. ఒకటి ఫైనాన్స్ ట్రాక్, రెండోది షెర్పా ట్రాక్. ఫైనాన్స్ ట్రాక్‌లో ఆయా దేశాల ఆర్థిక మంత్రులు, రిజర్వ్ బ్యాంకు గవర్నర్లు, సెక్రటరీలు సమావేశాలు జరుపుతూ ఉంటారు.

షెర్పా ట్రాక్‌లో జి20 దేశాల దౌత్యవేత్తల మధ్య సమావేశాలు నిర్వహిస్తుంటారు. జి-20లోని ప్రతి సభ్య దేశం ఏడాదికి ఒకసారి చొప్పున అధ్యక్షత వహించి, వార్షిక అజెండాను నిర్దేశిస్తుంది. దీని తొలి సమావేశం 1999 డిసెంబరులో బెర్లిన్(జర్మనీ)లో జరిగింది. ఈ సమావేశాలకు కూటమిలో సభ్య దేశాలే కాకుండా సభ్యత్వం లేని ఇతర దేశాలను కూడా కొన్నింటిని ఆహ్వానించడం జరుగుతుంది. దీనిలో భాగంగా 2008 నుంచి స్పెయిన్ దేశాన్ని శాశ్వత ఆహ్వానిత కూటమి ప్రకటించడం జరిగింది. ఇక సంస్థల విషయానికి వస్తే వరల్డ్ బ్యాంక్, ఐరాస, అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఓఈసీడీ, డబ్ల్యూహెచ్‌ఓ, ఐఎంఎఫ్, డబ్ల్యూటీవో, ఫైనాన్షియల్ స్టెబిలిటీ బోర్డు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్‌లు కూడా జి20 సదస్సులకు హాజరవుతాయి.

ఈ సదస్సులలో జి20 దేశాలు ప్రపంచ స్థాయి ప్రాధాన్యం గల ఆర్థిక అంశాలతో పాటు సమకాలీన అంశాలను కూడా చర్చిస్తూ ఉంటారు. పారిశ్రామిక, అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల మధ్య వ్యూహాత్మక ఆర్థిక సమాచార మార్పిడి, అంతర్జాతీయ ఆర్థిక స్థిరత్వాన్ని ప్రోత్సహించడానికి అవసరమైన చర్చలు వీటి ప్రధాన అజెండాగా ఉంటాయి. ముఖ్యంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఫైనాన్షియల్ మార్కెట్లు, పన్నుల విధానాలు, ఆర్థిక విధానాలు, అవినీతిపై పోరాటం వంటి అంశాలపై చర్చలు ఎక్కువగా ఉంటాయి. పర్యావరణ మార్పులు, ప్రపంచ ఆరోగ్యం, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం వంటివి కూడా అనుబంధ అంశాలుగా ఉంటాయి.

## లక్ష్యాలు

సుస్థిరాభివృద్ధిని, ఆర్థిక స్థిరత్వాన్ని ప్రపంచ వ్యాప్తంగా తీసుకురావడానికి సభ్య దేశాల మధ్య సహకారాలను పెంపొందించడం, భవిష్యత్తులో ఆర్థిక సంక్షోభాలు పునరావృతం కాకుండా ఆర్థిక నియంత్రణ చర్యలు చేపట్టడం. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలను ఆధునికీకరించడం, సభ్య దేశాల మధ్య వాణిజ్య అడ్డంకులను తొలగించడం ఈ కూటమి ప్రధాన లక్ష్యాలు.

ఇంతటి ప్రాధాన్యత కలిగిన కూటమికి శాశ్వత సిబ్బంది అంటూ ఎవరూ ఉండరు. కాబట్టి ఈ బృందంలోని ఒక దేశం తమ ప్రాంతం వంతు వచ్చినప్పుడు ప్రతి సంవత్సరం డిసెంబరులో సదస్సుకు అధ్యక్షత వహిస్తుంది.

తదుపరి శిఖరాగ్ర సదస్సును, చిన్న చిన్న సమావేశాలను నిర్వహించే బాధ్యతను ఆ దేశం స్వీకరిస్తుంది. ఇలా ప్రతి సంవత్సరం సమావేశం అయ్యే శిఖరాగ్ర సదస్సులో కూటమిలోని దేశాలన్నీ కలిసి అజెండా రూపొందించు కుంటాయి. ఈ అజెండా ప్రకారం జి20 నడిపించాల్సిన బాధ్యత నూతన అధ్యక్షుడి మీద, ప్రెసిడెన్సీ దేశం మీద ఉంటుంది. ఈ క్రమంలో బాధ్యతలు చేపట్టిన దేశం ఆ సంవత్సరానికి సంబంధించి ఒక థీమ్, లోగోను ఆవిష్కరించి తన కార్యాచరణ ఆరంభిస్తుంది.



## జి20 చీఫ్ కో ఆర్డినేటర్

జి20 సమావేశాల నిర్వహణకు కార్యక్రమాల అమలుకు ప్రత్యేకించి ఒక కో ఆర్డినేటర్ ఉంటాడు. మన దేశంలో జి20 కో ఆర్డినేటర్‌గా విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ ష్రింగ్లాను భారత ప్రభుత్వం నియమించింది. విధాన నిర్ణయాలు కానీ, జి20 సమావేశాలను భారత్ నిర్వహించటంలో అధ్యక్షుడు మోడికి సహకరించటంలో చీఫ్ కో ఆర్డినేటర్ పాత్ర కీలకమైనది.

## జి20 షెర్పా

మంచు పర్వతాలను అధిరోహించేప్పుడు ప్రత్యేకించి ఎవరెస్ట్‌ను ఎక్కేటప్పుడు అక్కడ ఉండే స్థానిక టిబెటన్ల సహాయ సహకారా లు అందిస్తారు. వీరినే షెర్పాలు అంటారు. అలాగే జి20 సదస్సు నిర్వహణకు సదస్సును నిర్వహించే దేశం కూటమికి అవసరమైన ప్రధానమైన దౌత్య పరమైన మార్గదర్శకాలు అందించడానికి ఆర్థిక అంశాలపై అవగాహన కలిగిన వ్యక్తిని షెర్పాగా నియమిస్తారు. దానిలో భాగంగా భారత్ నీతి ఆయోగ్‌ను ఆరేళ్ల నడిపించిన అమితాబ్ కాంత్‌ను ఇండియా జి20 షెర్పాగా నియమించింది.

## సచివాలయం లేని జి20

ఇంతటి ప్రాధాన్యం కలిగిన జి20 కూటమికి ఇప్పటివరకూ ఎలాంటి సచివాలయం లేదు. 2010లో ఫ్రాన్స్ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ ఐక్యరాజ్యసమితి వలె జి20 కూటమికి ఒక శాశ్వత సచివాలయాన్ని ప్రతిపాదించిన ప్పటికీ అది అమలు జరగలేదు. జి20 ప్రధాన కార్యాలయానికి సియోల్, పారిస్ నగరాలు అనువైనవిగా ఉంటాయని వాటిలో ఏదో ఒకచోట సచివాయలం ఏర్పాటు చేయమని బ్రెజిల్, చైనా దేశాలు మద్దతు ఇవ్వగా ఇటలీ, జపాన్ మాత్రం ఆ ప్రతిపాదనను వ్యతిరేకించాయి. ఇదే సమయంలో దీనికి ప్రత్యామ్నాయంగా దక్షిణ కొరియా దేశం సైబర్ సెక్రెటేరియట్‌ను ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన కూడా బుట్టదాఖలు అయ్యింది. ఈసారి భారత్ ప్రెసిడెన్సీలోనే ఈ సెక్రెటేరియట్ భవనం అనేది ఓ కొలిక్కి వచ్చి అది భారత్‌లో ఏర్పడితే మాత్రం మన దేశానికి అది ఓ ల్యాండ్ మార్క్‌లా మిగిలిపోతుంది. నేటి వరకూ ప్రధాన సచివాలయం లేకపోవడం వలన జి20 కూటమికి ఏ దేశంలో సదస్సు నిర్వహిస్తారో ఆ దేశమే ఏర్పాట్లు చేస్తుంది. ఆ దేశమే అధ్యక్షత వహిస్తుంది. ఇలా అధ్యక్షత వహించే దేశం ట్రోయికా అనే విధానాన్ని అనుసరిస్తుంది. ట్రోయికా అంటే చివరిగా జి20కు ఆతిథ్యం ఇచ్చిన దేశం, ప్రస్తుతం ఆతిథ్యం ఇవ్వబోయే దేశం. వచ్చే ఏడాది ఆతిథ్యం ఇవ్వబోయే దేశం.. ఇలా ఎప్పటికప్పుడు మూడు దేశాలు కో ఆర్డినేట్ చేసుకుని సమావేశాలను నిర్వహించుకునే విధానాన్ని ట్రోయికా అంటారు.



దీనిలో అధ్యక్ష ఎన్నిక కోసం జి20ని ఐదు గ్రూపులుగా విభజిస్తారు. గ్రూపుల వారీగా అధ్యక్ష బాధ్యతలు అందుతాయి. ఈ గ్రూపులో ఓటింగ్ నిర్వహించి ఎంపిక చేస్తారు. ఈ ఎంపిక ద్వారానే 2023లో భారత్‌లో జి20 సదస్సు జరగనుంది. ఈ మధ్యనే ఇండోనేషియాలోని బాలి ఐలాండ్‌లో రెండు రోజుల పాటు జరిగిన జి20 సదస్సు ముగిసింది. సదస్సు చివరి రోజున ఇండోనేషియా ప్రధాని జోకో విడోడో నుంచి డిసెంబరు 1వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోడీ జి20 అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. గతంలో నిర్ణయించిన షెడ్యూల్ కంటే ఒక ఏడాది ఆలస్యంగా భారత్ ఈ సమ్మిట్‌ను నిర్వహించనుంది. మొదట్లో 2022లో ఈ సదస్సులో నిర్వహించాలని నిర్ణయించుకోగా- అది కాస్తా 2023కి మారింది. ఒక పక్క 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించుకుంటున్న వేళ మరొకపక్క ప్రపంచంలో జీడీపీ రీత్యా ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగానూ, కొనుగోలు శక్తి రీత్యా మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగానూ భారత్ గుర్తింపు పొందిన సమయాన భారత్ జి20.. 18వ శిఖరాగ్ర సదస్సుకు అధ్యక్ష పదవిని చేపట్టడం విశేషంగా చెప్పుకోవచ్చు. వచ్చే ఏడాది సెప్టెంబరు తొమ్మిది, పదో తేదీల్లో జరిగే ఈ సదస్సుకు న్యూఢిల్లీ ఆతిథ్యమివ్వనుంది. దీనిలో భాగంగా 32 రంగాల్లో 200కు పైగా సమావేశాలు జరగనున్నాయి. దేశ వ్యాప్తంగా సుమారు యాభై ప్రాంతాలు వాటికి వేదికలు కానున్నాయి. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుండి విశాఖపట్నంలో సదస్సు నిర్వహించాలని కేంద్ర సర్కారు నిర్ణయించింది. దేశ వ్యాప్తంగా మనవైన సాంస్కృతిక సంపదలకు నెలవులైన ఆయా ప్రదేశాల విశేషాలను విదేశీ అతిథులకు వివరించేందుకు వెయ్యి మంది గైడ్లను కేంద్ర పర్యాటక శాఖ ప్రత్యేకంగా నియమించడానికి సిద్ధం అయ్యింది.

ఈ నేపథ్యంలో 2023 జి20 ప్రెసిడెన్సీ లోగో, థీమ్, వెబ్‌సైట్‌ను ప్రధాని నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆవిష్కరించడమే కాదు, లోగో, థీమ్ విశిష్టతను తనదైన శైలిలో వివరించారు.

వసుధైక కుటుంబం (లోగో విశిష్టత)

విదేశీ వ్యవహారాల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నినాదం ఒక్కటే వసుధైక కుటుంబం. ఇదే నినాదాన్ని జీ20 దేశాలకు చేరువ చేయాలని భారత్ ప్రణాళిక. ఇదే నినాదంతో జీ20, 2023 లోగోను ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరిస్తూ లోగో అంతరార్థాన్ని విపులీకరించారు. లోగోలో కమలం 'వసుధైక కుటుంబం-ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే సందేశం ఉంది. శతాబ్దానికి ఒకసారి ప్రపంచ వ్యాప్తంగా విపత్తులు, మహమ్మారులు తలెత్తి భాయనక పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో విశ్వమానవాళిలో నిస్పృహ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇటువంటి సందర్భంలో ఆశావాహ జీవనం గడపాలి. అందుకే లోగోలో కమలం జోడించడం జరిగింది. జి20 లోగోలోని కమలం ఆశకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఎన్ని క్లిష్ట పరిస్తితులు ఎదురైనా కమలం వికసిస్తూనే ఉంటుంది. అంతేకాకుండా కమలంలోని ఏడు రేకులు భూగోళంలోని ఏడు ఖండాలకు ప్రతీకలే కాకుండా అవి ఏడు సంగీత స్వరాలను సూచిస్తాయి.




వసుధైక కుటుంబ ప్రపంచంలో భారతదేశం కరుణకు సంకేతమని, కమలం సాంస్కృతిక వారసత్వ విశ్వాసాన్ని చిత్రీకరిస్తుంది. ప్రపంచాన్ని ఏకతాటిపైకి తీసుకురావడంలో భారతదేశం ముందు వరుసలో ఉంటుంది. పునరుత్పాదక శక్తిని పొదుపు చేయడంలో భారతదేశం ఒక సూర్యుడు, ఒకే ప్రపంచం, ఒకే గ్రిడ్ వంటి కార్యక్రమాలతో ప్రపంచాన్ని ముందుండి నడిపిస్తోందని అన్నారు.

"జి20లో ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు" అనే మా మంత్రం ప్రపంచ సంక్షేమానికి మార్గం సుగమం చేస్తుందని భారతదేశం జి20 అధ్యక్ష పదవిని చేపట్టడం 130 కోట్ల మంది భారతీయులకు గర్వకారణమని ప్రధాని అన్నారు.

"నేడు కోవిడ్-19 దుష్ప్రభావాలను ప్రపంచ దేశాలు చవిచూస్తున్నాయి. ఒకవైపు ఘర్షణలు, మరోవైపు ఆర్థిక మందగమనం అతలాకుతలం చేస్తున్నాయి. ఇలాంటి సమయాల్లో కొత్త ఆశలను ఈ జి20 లోగో చిగురింపచేస్తోంది" అంటూ ప్రధాని చేసిన భావోద్వేగ సందేశం ఆచరణలో ఎంతవరకు సఫలీకృతం అవుతుంది అనేది వేచి చూడవలసిందే. ఎందుకంటే సిద్ధాంతాలు, సందేశాలు, భావోద్వేగాలు వాస్తవంలో అమలు అయ్యేలా చేయడం అనేది అనుకున్నంత సులభం కాదు. అలా అని అసాధ్యం కూడా కాదు. ఎందుకంటే నేడు ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు విధాన పరమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితులలో మన దేశం జి20 కూటమి అధ్యక్ష పదవిని చేపట్టింది. ఒకవైపు ప్రపంచ వృద్ధి, వాణిజ్యం మందగించడం, అధిక ద్రవ్యోల్బణం, భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, రుణ ఒత్తిడి, మరొకవైపు వాతావరణ మార్పులు, ఇంకా తొలగిపోని మహమ్మారి పీడ లాంటి సవాళ్లు ఇంకా మన ముందు సాక్షీభూతంగా నిలచి వున్నాయి. ఇటువంటి బహుముఖ సంక్షోభాల సుడిగుండంలో ప్రపంచం కొట్టుమిట్టాడుతున్న తరుణంలో భారత్ జి20 బాధ్యతలు చేపట్టింది. ఒక పక్క కొవిడ్ అనంతరం ఏర్పడిన ప్రభావాలు మరొకపక్క రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రతికూలతలు వలన ఇప్పటికే అంతర్జాతీయ సరఫరా గొలుసులు విచ్ఛిన్నమయ్యాయి. ఇంధనం, ఆహారం, ఎరువులు అందుబాటుపై ఇంకా భయాందోళనలు కొనసాగుతున్నాయి. తత్ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగం పెరిగి పేదరికం విస్తృతమవుతూ వస్తున్నది. దీనికి తోడుగా వాతావరణంలో మార్పులు అనేక విపత్తులకు దారులు తీస్తున్నాయి.

ప్రపంచంలో పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు, ఆర్థిక సంక్షోభం, ఆహారం, ఇంధన ధరల పెరుగుదల వంటి సమస్యలతో పాటు అతి సమీపంలో మాంద్యం ముప్పు ముంచుకు వస్తుందనే సంకేతాలు ప్రపంచాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిత' అనే విశేష స్ఫూర్తితో జి20 పగ్గాలను భారతావని చేపట్టి సత్ఫలితాలు సాధించడం అనేది ఒక యజ్ఞం లాంటిది. అయితే క్లిష్ట సమయంలో కీలకమైన బాధ్యతలు చేపట్టిన మనం కొత్త ఆలోచనలు చేసి, సమష్టి నిర్ణయాలు తీసుకునేలా తీర్చిదిద్దడానికి సిద్ధంగా ఉన్నామని ప్రధాని సగర్వంగా

**అందరినీ కలుపుకుపోతాం..**

ఉగ్రవాదం, వాతావరణ మార్పులు, కరోనా మహమ్మారి వంటివి నేడు మానవాళికి అతిపెద్ద సవాళ్లుగా మారాయి. అయితే మనం అందరం సమిష్టిగా పోరాడగలిగితే ఈ సంక్షోభాలను ఎదుర్కోవడం కష్టమేమీ కాదు. ఈ విషయంలో మనం చేసే కృషి కేవలం కూటమిలో గల దేశాల ప్రయోజనాలు కోసమే కాదు నిర్లక్ష్యానికి గురైన దేశాల ప్రయోజనాల కోసం కూడా. అందుచేత మిగిలిన దేశాలను మద్దతును కూడా కలుపుకొని ప్రపంచాన్ని ముందుకు తీసుకువెళ్లే బృహత్తర ఆలోచన భారత్‌కు ఉందని అందరితో చర్చించి, జి20 ప్రాధాన్యతలను నిర్ణయించుకుంటామని భారత్‌కు లభించిన ఈ అవకాశాన్ని ఓ సవాల్‌గా తీసుకుని కార్యాచరణలో ముందడుగు వేస్తామనే ఆత్మవిశ్వాసం మాత్రం ప్రధానిలో మెండుగా కనిపిస్తోంది. జి20 వర్ధమాన దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని పెంపొందించడం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేయాలన్న లక్ష్యంతో 23 ఏళ్ల క్రితం ఏర్పడిన జి20 కూటమి లక్ష్యాలు చూస్తే ఘనంగానే ఉన్నా సాధించింది మాత్రం అల్పమనే చెప్పవచ్చు. అంతర్జాతీయంగా ఉమ్మడి లక్ష్యాల కోసం ఈ తరహా కూటములు గతంలో ఎన్నో ఏర్పాటు జరిగినప్పటికీ వాటిలో ఆధిపత్యం అనేది భాగ్యవంత దేశాలదే తప్ప బడుగు దేశాలకు ఏమాత్రం అవకాశం ఉండదు అనేది మనకు గతంలో అనేక ఘటనలు రుజువు చేశాయి. ఐక్యరాజ్యసమితి మాదిరిగానే ఇలాంటి కూటములు కూడా అగ్ర, సంపన్న రాజ్యాల ఒత్తిడులకు లోనవుతున్నాయి అనేది అక్షర సత్యం. ఇదే రీతిలో జి20 సదస్సులో కూడా కొందరు నేతలు మాత్రమే ఆధిపత్యం చెలాయిస్తున్నారనే విమర్శ కూడా లేకపోలేదు. దీని నిర్వహణలో మిగతా దేశాల ప్రాతినిధ్యం తక్కువేననే అభిప్రాయం ఉండటమనే కాదు అది వాస్తవం కూడా. దీనివల్లనే చిన్న దేశాలు తమ సమస్యలను కూడా సరిగా చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. అంతేకాదు, ఈ సమావేశాల్లో నిర్ణయాలు చేయటానికి లాంఛనంగా ఓటింగ్ ప్రక్రియ అనేది ఉండదు. దానివలన తీసుకున్న నిర్ణయాలకు చట్టబద్ధంగా కట్టుబడాల్సిన అవసరం లేదు. అందుచేతనే ఈ సదస్సులలో జరిగే ఒప్పందాలు కూడా అంతా న్యాయబద్ధంగా ఉండవనే అభిప్రాయానికి బలం చేకూరింది.

అంతేకాదు, దీనిలో చాలా దేశాలకు స్థానం కల్పించకపోవటం వల్ల ముఖ్యమైన నిర్ణయాలు న్యాయంగా ఉండవని కొందరు వాదిస్తున్నారు. ఈ జి20 సమావేశాలకు దాదాపు 170 దేశాలకు ఆహ్వానమే ఉండదు. దీనివల్ల ఇది కేవలం "మాటల కూటమి" తప్ప పనిలో ప్రగతి చాలా స్వల్పమని ఇంకొందరు కొట్టివేస్తున్నారు. అధికారాల దృష్ట్యా చూస్తే జి20కి ప్రత్యేకమైన అధికారాలు అంటూ ఏవీ లేవనే చెప్పవచ్చు. అంటే వేరే దేశాల అంతర్గత వ్యవహారాల్లో జి20 అధ్యక్షుడు జోక్యం చేసుకోలేరు. కానీ విధానాల రూపకల్పలో మాత్రం ప్రభావితం చేయగలరు. ఈ విషయంలో భారత్ మిగిలిన ప్రపంచ దేశాలను ఎంతవరకు ప్రభావితం చేయగలదు అనేది ప్రశ్నార్థకమే అయినప్పటికీ దాదాపుగా ప్రపంచంలో మూడవ వంతు దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తోన్న ఈ కూటమి తల్చుకుంటే బడుగు దేశాల్లో కరవు కాటకాలను ఆపవచ్చు. యుద్ధాలను నివారించవచ్చు. వాస్తవంలో చూస్తే ప్రపంచ వ్యాప్తంగా బలహీన, బడుగు వర్గాల కోసం ఈ సంస్థ



చేసిందేమంటే చెప్పుకోవడానికి పెద్దగా ఏమీ లేదనే చెప్పవచ్చు. ప్రస్తుతం మన దేశానికి జి20 శిఖరాగ్ర సదస్సు భారత్ నిర్వహించే అవకాశం దక్కడం ఆహ్వానించదగ్గ పరిణామం. అయితే ఇది కేవలం మోడీ ప్రతిభ వల్లనే అయ్యిందనే ప్రచారం కూడా బీజేపీ వర్గాలలో ఎక్కువగా జరుగుతూ ఉంది. వాస్తవం జీ20 కూటమిలో సభ్యత్వం గల ప్రతీ దేశానికి సంవత్సరానికి ఒక దేశానికి చొప్పున శిఖరాగ్ర సదస్సును నిర్వహించే అవకాశం లభిస్తుంది. దానిలో భాగంగానే ఆ కూటమిలో సభ్యత్వం గల భారత్‌కు ఈ అవకాశం వచ్చింది తప్ప నరేంద్ర మోదీ సమర్థత వలన కాదనే విషయాన్ని మోదీ భక్తులు గుర్తించాలనే విమర్శలు

వినవస్తున్నాయి. ఏది ఏమైనా ఏదో ఒక రూపంలో భారత్‌కు ఒక బలమైన కూటమి శిఖరాగ్ర సదస్సును నిర్వహించే అవకాశం వచ్చినపుడు దానిని సమర్థవంతంగా నిర్వహించి భారత్ ఖ్యాతిని ప్రపంచానికి తెలియచేయగలిగితే మోడీ సమర్థతను అందరూ అంగీకరిస్తారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రధాని భారత్-చైనా సరిహద్దుల వద్ద చైనా దురాక్రమణ తీరును ఎండగడుతూ మిగిలిన దేశాలను ఒప్పించి భారత్ ఈ కూటమిలో భారత్ తీర్మానం చేయించగలదా? దానితో పాటు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ దురాగతాలను కూటమి దృష్టికి తీసుకువచ్చి పాకిస్తాన్‌పై వత్తిడి తీసుకువచ్చే విధంగా మోడీ చొరవ తీసుకోగలరా? అనే ప్రశ్నలు విపక్షాల నుండి ఎదురవుతున్నాయి. ఇదే సమయంలో ముంచుకు వస్తున్న మాంద్యం ముప్పుకట్టడికి భారత్ వ్యూహాత్మక ఆలోచనలను కూటమి చేత అమలు పరచగలదా? అనే ప్రశ్నలు కూడా వినవస్తున్నాయి. ఏది ఏమైనా ఈ కూటమిలో భారత్ క్రియాశీలక పాత్ర పోషించాలని అని కోరుకోవాలి. దానికి అందరి మద్దతు కూడా కావాలి తప్ప వ్యక్తిగత పూజలకు ప్రాధాన్యం ఇస్తూపోతే అసలు లక్ష్యం పక్కకు పోయే ప్రమాదం ఉంది. ఇది దేశ ప్రతిష్టతకు సంబంధించిన కార్యక్రమం. దానిని భారత్ సమర్థవంతంగా నిర్వహిస్తే ప్రపంచం గుర్తింపు సాధించడం తథ్యం. అయితే సాధ్యాసాధ్యాలు కూడా పరిగణలోనికి తీసుకుని భారత్ కార్యాచరణ చేపట్టాలి. వీటి ప్రకారం వాతావరణ కార్యాచరణకు సంబంధించి వాతావరణ ఆర్థిక సహాయం, సాంకేతికత బదిలీపై ప్రధానంగా భారత్ దృష్టి సారించవలసి ఉంది. అలాగే ప్రపంచవ్యాప్త వర్ధమాన దేశాలకు న్యాయబద్ధ ఇంధన పరివర్తనలకు భారత్ భరోసా ఇచ్చే విధంగా విధానాలు రూపొందించాలి. ముఖ్యంగా కర్బన ఉద్గారాల ప్రభావాన్ని తగ్గించే విధంగా హరిత ఉదజని భారీ విస్తరణపై భారత్ దృష్టి పెట్టి ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలవాలి. రష్యా ఉక్రెయిన్ యుద్ధం వలన ఏర్పడిన ఆహార, ఇంధన భద్రతలపై ప్రతికూల ప్రభావాలను అరికట్టే విధానాలను రూపొందిస్తూ ఘర్షణలు శాంతియుత పరిష్కారానికి కృషి సల్పడంతో పాటు సంక్షోభ నివారణకు కృషి కోసం చర్యలు ఇప్పుడు కీలకం.

**(మిగతా 27వ పేజీలో)**



# విరిసిన మరుమల్లెలు

చిన్నారుల చిరునవ్వులు
విరిసిన హరివిల్లులు
కురిసే తొలకరి జల్లులు.
చిన్నారుల బోసినవ్వులు
విరిసిన మందారాలు
కల్మషం లేని
నిర్మల దరహాసాలు.
చిన్నారుల పకపక నవ్వులు
విరిసిన మరుమల్లెలు
కుట్రలు తెలియని
దరహాస చంద్రికలు.
చిన్నారుల
కిలకిల నవ్వులు
ఆహ్లాదపు విరిజల్లులు
కన్నవారి బాధ్యతను గుర్తు చేసే
విద్యా కుసుమాలు

**- కాయల నాగేంద్ర**

# దేహ ధృవాలు

**నేను**
ఒక విషయం
చెప్పాలి
సందిగ్ధ రేఖల్ని
తుడిచేయాలి.
నువ్వు
ఒకసారి ఒడిలోకి తీసుకోవాలి
వెచ్చని స్పర్శతో మది చల్లబరచాలి.
మనం
భావాల జలపాతం కింద
ప్రేమ దాహాన్ని తీర్చుకుంటున్నాం.
అంతిమంగా
నువ్వూ నేను ఒకటని చెప్పాలి
దేహాలు మాత్రమే
ధృవాలు అయ్యాయి.

**- దాసరి మోహన్**

# అక్షర మాల

నేనొక ప్రేమపిపాసిని ఆ జాబిలొక
అందని చిరునవ్వుల దివ్వే నా గుండెలపై ఆ రాణి
అనునిత్యం సవారి చేస్తున్నట్లనిపిస్తుంది
ఎదపై సొదలు చేస్తూ/ రంగు రంగుల ప్రపంచంలోకి
మరో కొత్త బంగారు లోకంలోకి
లాక్కెళ్లుతున్నట్లనిపిస్తుంది/ ఎన్ని జన్మల బంధమో ఇది
జన్మజన్మల అనుబంధం/ ఆ చెలి ఎక్కడో ఉండి
ఇక్కడ ఈ కవి హృదిని నిలువునా/
దోచుకుంది హృదిలో దాచుకుంది/ మనసున మల్లెలు
పూయించే/ కలువపూల చెలియా/ అందుకో అర్పిస్తున్నాను
అక్షరమాలలు
ఓ... చెలియా.../ ఓ..నా హృదయానిత జనితా
నా కవితకు నాంది పలికిన చెలియా
ఓ... నా ప్రియమణి

**- కొరుప్రోలు హరనాథ్**

# ఆ ఒక్కమాట నుదుటిపై..

**కౌగిట**
కలవరింత పొంగుకి
మనసు పదునెక్కి
పడిమొలిచిన ఒక్కో క్షణం
దూరాన్ని మోయలేక
కరిగే కాలం అంచున
ఏకాంతం కింద
నలుగుతుంటే..
రాత్రి కాగితమై
నిద్ర ద్రావకంలో
మునిగిన కన్ను కలమై
ఉప్పు తీపి మరకల్లో
నల్లటి ఊహాల్ని
తెల్లగా కడగాలని
నమ్మకం దాచిన ఆ
ఒక్కమాట
నుదుటపై ముద్దు
పెట్టుకుంది.
ఇప్పుడు ఇక
ముద్దుకి
ముట్టుకోవడం కాదు
మాట్లాడటం రావాలి.

**- చందలూరి నారాయణరావు**





# పుస్తక సమీక్ష


## ఏడు నవలల చిత్రపు 'ఏడడుగులు'



రచయిత తన తల్లి సీతామహాలక్ష్మికి అంకితం చేసారు. ఈ ఏడడుగులు నవలికల పుస్తకాన్ని డా॥అంపశయ్య నవీన్, పుస్తకశిల్పి తాళ్లపల్లి మురళీధరగౌడు ఈ పుస్తకానికి చక్కటి ముందుమాట రాసారు. ఈ పుస్తకంలో ఏడడుగులు, జీవన వలయాలు, ప్రాణదాత, వెన్నెల, హరిశ్చంద్రరావు హిందీ చదువు, ఎత్తరుగుల ఇల్లు, పార్వతీ కల్యాణం అనే ఏడు నవలల సమాహారం ఈ పుస్తకం. ఒకప్పుడు 1960-70లలో తెలుగు నవలలు ఎంతో విస్తృతంగా వెలువడేవి. అవే వెండితెరకు చేరేవి. ఈ సంపుటిలో 'ఏడడుగులు' ఒక్కటే పెద్ద నవల. మిగతావిన్నీ నవలలే. డా॥అంపశయ్య నవీన్ చెప్పినట్లుగా ఈ సంపుటిలోని దాదాపు అన్ని నవలల్లో పెళ్లిళ్లు-పేరంటాలు, పెళ్లిచూపులు, పెళ్లికి ముందు యువతీయువకుల మానసిక స్థితి, పెళ్లి తర్వాత జరిగే పరిస్థితులు, సగటు మధ్యతరగతి కుటుంబాల్లో జరిగే వివాహ వాతావరణం కనిపిస్తాయి. అన్ని నవలలూ ఏకబిగువున పాఠకుల్ని చదివిస్తాయి. ఒకే ఆఫీసులో పని చేసే ప్రద్యుమ్నరావు ఉషస్వినిలు ప్రేమించుకొం టారు. ఇద్దరూ కథలు రాస్తూ ప్రేమించుకొని పెళ్లి చేసుకొంటారు. చంద్రమతి అనే ఆమెను భర్త వదిలేస్తాడు. అతడు ప్రద్యుమ్నరావు రాసిన కథ చదివి మార్పుకులోనై చంద్రమతిని మళ్లీ భార్యగా స్వీకరి స్తాడు. ప్రద్యుమ్నరావు, ఉషస్వినిల ప్రేమ పెళ్లి వారి జీవితంలోని సుఖానుభూతులు నవల్లో చాలా కనిపిస్తాయి. **(ఏడడుగులు, రచన: చిత్రపు హనుమంతరావు, వెల: రూ 350, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)**

**- తంగిరాల చక్రవర్తి**

## సంస్కరణలకు నోచుకోని జైళ్ల వ్యవస్థ



సమాజంలోని 'చెడు'ను దూరంగా ఉంచి, చెడు ప్రవర్తన గలవారిని ఏరివేసి, వారిలో పరివర్తన తేవాలన్న ఉద్దేశంతో జైళ్లు ఏర్పడ్డాయి. రాజుల కాలం నుండి నేరగాళ్లకు కారాగార శిక్ష విధించటం ఉన్నదే! కంసుడు శ్రీకృష్ణుడి తండ్రి, తల్లి వసుదేవు దులను జైలులో ఉంచుతాడు. ఆనాడు శిక్షగా ఉన్న వ్యవస్థ నేడు శిక్ష కంటే పరివర్తనకు ప్రాధాన్యం ఇస్తోంది. మన 'ఇండియన్ పీనల్ కోడ్'ను మొట్టమొదటి వ్యవస్థీకృత ప్రయత్నంగా చెప్ప వచ్చును. ప్రభుత్వపాలనలోని అన్ని వ్యవస్థల వలె జైళ్ల వ్యవస్థ కూడా లోపభూయిష్టంగా ఉందని, సంస్కరించాల్సిన అవసరం ఎంతో ఉందని అంటాడు రచయిత, జర్నలిస్టు దామరపల్లి నర్సింహారెడ్డి. తరచుగా చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సందర్శిస్తూ 2009 నుండి 2020 వరకు పలు వ్యాసాలను ప్రముఖ పత్రికల్లో ప్రకటించారు. అట్టి వ్యాస సంకలనమే ప్రస్తుత సంపుటి. ఆంగ్లేయుల పాలనలో జైలు పోరాటాలకు చిరునామా అయిన అయిన జతిన్‌దాస్‌కు అంకితమీయబడిన ఈ సంపుటిలో 42 అధ్యాయాలున్నాయి. జైలు జీవితం, జైళ్లు ఎలా ఉండాలి? ఎలా ఉన్నాయి, క్షమాభిక్ష ఎలా దొరుకుతుంది? మహిళా జైలు, జైలు పరిపాలన యంత్రాంగం, వారి సమస్యలు అన్నింటినీ సమగ్రంగా చర్చించారు రచయిత. సామాన్య పాఠకుల కంటే, పాలకులకే ఎక్కువ ఉపయోగపడే వ్యాసాలివి.

**(జైళ్లు-ఖైదీలు, రచన: దామరపల్లినర్సింహారెడ్డి, వెల: రూ 230, ప్రతులకు: ఇ.నం.5-11-190/1, ఇందిరానగర్ కాలనీ, ప్రశాంత్‌నగర్, సిద్దిపేట)**

**- కూర చిదంబరం**

## 95 యేళ్ల ప్రజాపత్రిక

స్వాతంత్ర్య సమరయోధుడు బోడుపాటి శివరామ కవి స్థాపించిన ప్రజాపత్రిక నాటి బిబిజి, తిలక్, ఆర్.బి.పెండ్యాల, రమాదేవి సారధ్యంలో ప్రస్తుతం సుదర్శన్ ఎడిటర్‌గా రాజకీయ వార్త పత్రికగా 95ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకోవడం అభినందించతగ్గ ముఖ్యాంశం. రాజమండ్రి మేధావి



కుటుంబం సుదర్శన్, రమాదేవి, సుసేనా శ్రావణి, సుస్మితా ప్రియాంక ప్రజాపత్రిక కుటుంబంగా, తెలుగు నాట దశాబ్దాలుగా సుపరిచితులు.

ఈ 95వ వార్షికోత్సవ సంచిక విజ్ఞానదాయకంగా ఎంతో ప్రతిభావంతమైన రచయితల కృషికి దర్పణంగా ప్రతిబింబింస్తోంది. హేతువాద దృక్పథంతో సమాజసంక్షేమానికి, జనశ్రేయస్సుకు దశాబ్దాల తరబడి అంకితం కావడం సామాన్య విషయం కాదు. యిది తెలుగునాట, మరో నాలుగేళ్లలో శతసంరంభ వేడుకకు పరుగులు తీస్తున్న అద్భుత పత్రిక. వర్కింగ్ ఎడిటర పైడిపల్లి శ్రీలత, గౌ॥సంపాదకులు సుదర్శన్ అభినందనీయులు.

**(ప్రజాపత్రిక, 21-11-1413, కోర్లమ్మపేట, దేవీచౌక్, రాజమండ్రి-4)**

**- ఎర్రమిల్లి**

## దర్భముళ్ల కవిత్వ బంధం

కవి దర్భముళ్ల చంద్రశేఖర్ ద్వితీయ కవితా సంపుటి 'శిఖరానికి త్రోవ'. సాహిత్యాభిరుచి కలిగిన దర్భముళ్ల చంద్రశేఖర్ సృజనకు వృత్తి ఓ ప్రబంధనం. వీలు చిక్కిందేమో..కవిత్వానికి దారులు (త్రోవ)పరుస్తూ వడివడిగా 94 అంగల (కవితలు)తో కవితా



ప్రియుల ముంగిట వాలాడు. 'పరుగుపరుగున వచ్చి తోడుగా పక్కనున్నట్లు/ ఈ కన్నీళ్లెందుకో మరి ఆగకుండా వస్తాయి/ ఇంత భరోసాని భద్రంగా ఇస్తాయి' అంటూ ఉపశమనానికి చిట్కా చెప్తున్నాడు. భార్యా,భర్తలన్నాక కలహాలు మామూలే. కాసేపు 'నిశ్శబ్దయుద్ధం' లోపల బయట 'జుగల్‌బందీ'లాగా జరుగుతూనే వుం టుంది...కలివిడిగా కలహించాక కలిస్తేనే కదా.. కమనీయ కల్హారాల జగల్బంది జవళీ' అని తేల్చేస్తాడు. పట్టణాలు పల్లెల్ని ఆక్రమిస్తున్న రోజులివి. రోజురోజుకీ మరీ ఇరుకైపోతున్న ఊరు 'ముడతల ముదిమి చర్మం కప్పుకుని/ముసలిదై పోతోంది!' అంటాడు. వృద్ధాప్యం తర్వాత మరణమేగా! పల్లెలు అంతరించిపోతున్నవని కవి భావన. 'దేశ, విదేశాల్లో ఎక్కడైనా సరే..పేద మహిళ పరిస్థితి ఒకేలా వుంది.. వుంటుంది' అంటాడు 'ఆమె ఒక దేవత' కవితలో అతి అలంకారాలు, మితిమీరిన శబ్దలౌల్యం, అక్కడక్కడా తన సహజ కవితా కేశవానికి ఆటంకం కలిగించిందేమో చంద్రశేఖర్ సరి చూసుకోవాల్సిన అవసరం వుంది. **(శిఖరానికి త్రోవ, రచన: దర్భముళ్ల చంద్రశేఖర్, వెల: రూ 200, ప్రతులకు: 303, ఆర్ఆర్ టవర్స్, రైతుబజార్ ఎదురుగా, గోపాలపట్నం, విశాఖపట్నం)**

**- రమణ వెలమకన్ని**





# సంపదని సృష్టిస్తున్న వెదురు

తినడానికి తిండీ, ఉండటానికి గూడు, కట్టుకోవడానికి బట్టలు.. ఇవి మనిషి కనీస అవసరాలు. వీటన్నింటినీ ఇవ్వగలిగే గడ్డిమొక్కే వెదురు. అందుకే పుట్టినప్పుడు వేసే ఉయ్యాల నుంచి చనిపోయాక మోసుకెళ్లే పాడు వరకూ వెదురు తోడుగా ఉంటుంది.. అన్న నానుడి కొన్ని చోట్ల వాడుకలో ఉంది. దీన్ని నిజం చేస్తూ దైనందిన జీవితంలో అవసరమయ్యేవన్నీ వెదురుతో చేస్తున్నారిప్పుడు. అంటే వేసుకునే దుస్తులూ, కప్పుకునే క్విల్ట్‌లూ, తాగే బాటిలు, తినే ప్లేటూ.. ఇలా సకలం వెదురుమయంగా మారే రోజు ఎంతో దూరంలో లేదన్నమాట.

వెదురుని పెంచినా, వాడినా, తిన్నా అంతా మన మంచికే. నేలను సారవంతం చేస్తూ గాలిని శుద్ధి చేస్తూ మనిషికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తూ ఆదాయాన్నీ ఇస్తోంది వెదురుపంట. కనుక తృణ, చిరుధాన్యాలతో పాటు ఈ పచ్చ బంగారాన్నీ పెంచండి.. అంటున్నారందరూ.

వెదురు నుంచి నారను తయారుచేసే ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టే ఆలోచనా చేస్తోంది. మన దేశంలో వెదురు కొరత తీవ్రంగా ఉండటంతో అగరుబత్తుల తయారీకి కూడా దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. అందుకే అటవీశాఖ పరిధిలోనే ఉండే వెదురుమొక్కని హార్టికల్చరల్ విభాగంలోకి చేర్చి, పెంచేందుకు సబ్సిడీని అందిస్తోంది ప్రభుత్వం. కారణం..?



మిగిలిన చెట్లతో పోలిస్తే వెదురు పది రెట్లు వేగంగా వాతావరణం నుంచి కార్బన డై ఆక్సైడ్‌ను తొలగిస్తుంది. అంతే ఎక్కువగా ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది ఒక వెదురు పొద. అంతే విస్తీర్ణంలో వున్న చెట్టుకన్నా 35 శాతం ఎక్కువ ప్రాణవాయువుని ఇస్తుంది. కాగితం తయారీలో వాడే కలపగుజ్జు కోసం చెట్లను కొట్టడంతో వాతావరణం వేడెక్కడంతో పాటు అడవుల్ని తిరిగి పెంచడానికి ఏళ్లకు ఏళ్లు పడుతుంది. దాంతో కలపగుజ్జు తయారీ తగ్గింది. అందుకే ఆ చెట్లకు బదులు వెదురుని పెంచితే వేగంగా పెరుగుతుంది. ఎంతంటే రోజుకి 35 నుంచి 47.6 అంగుళాల చొప్పున చూస్తుండగానే ఎదిగిపోతుంది. రోజుకి మూడు అడుగుల వరకూ పెరిగేవి కూడా ఉన్నాయి. పదీ ఇరవేళ్ల పాటు పెరిగే కలపతో పోలిస్తే వెదురు మూడు నుంచి ఐదేళ్లలోనే పెరుగుతుంది. కనుకనే కలపకీ కలపగుజ్జుకీ చక్కని ప్రత్యామ్నాయంగా మారింది వెదురు.



వెదురు ఉత్పత్తులు ఒకప్పుడు వెదురుతో ఇంట్లో వాడుకోవడానికి, వ్యవసాయానికి అవసరమయ్యే బుట్టలు, తట్టలు, చేటలు, తడికెలు లాంటివి అల్లడమే తెలుసు. గిరిజన తెగలు మాత్రం వెదురుఇళ్లు కట్టుకుని, వస్తువులూ తయారు చేసుకుంటాయి. అందుకే దీనికి పేదవాడి కలపగా పేరు. అయితే పర్యావరణ ప్రియమనో లేదా కొత్తదనం కోసమోగానీ ఇప్పుడు అవన్నీ ఆధునికులకీ నచ్చుతున్నాయి. ఇంట్లో, బాల్కనీలో, పెరట్లో వెదురుమొక్కల్ని పెంచడమే కాదు, దాంతో అల్లిన హస్త కళాకృతులను అలంకరిస్తున్నారు.





రిసార్టులు, ఫామ్ హౌస్‌ల్లో వెదురిళ్లు కట్టుకోవడంతో పాటు ఫ్లోరింగ్ నుంచి ఫర్నిచర్ వరకూ వెదురే అందం అనుకునేవాళ్ల సంఖ్యా పెరుగుతోంది. చైనాలో పూర్వ కాలం నుంచీ వెదురుతో చేసిన కాగితం వాడుకలో ఉంది. అడవుల విస్తీర్ణం రోజురోజుకీ తగ్గడంతో ప్రపంచ దేశాలన్నీ వెదురు కాగితం మీద దృష్టి సారిస్తున్నాయి. పైగా కలప నుంచి కన్నా దీంతో సులభంగా తయారు చేయవచ్చు. వెదురుగుజ్జుతో కాగితంతో పాటు డిస్పోజబుల్ పేపర్‌కప్పులు, టాయిలెట్ పేపరు, రీయూజబుల్ ప్లేట్లు, గిన్నెలు, కార్డుబోర్డులు లాంటివి తయారు చేస్తున్నారు.



చెక్క, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే క్రమంలో యాక్సెసరీలు, వంటింటి సామగ్రి, డిన్నర్‌వేర్‌లతో పాటు బయో ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, జ్యువెలరీ, వాహనాలు, పిల్లల ఆటవస్తువులు.. ఇలా అన్నింటా వెదురు వాడకం రోజు రోజుకీ పెరుగుతోంది. సప్త స్వరాల్ని పలికించే వేణువు, ఫిడేలు, ఏక్‌తారా లాంటి సంగీత వాద్య పరికరాలు సైతం వెదురుగానాన్ని ఆలపిస్తున్నాయి.

ఒక ఎకరంలో పండే పత్తితో పోలిస్తే వెదురు నుంచి యాభై రెట్లు ఎక్కువ ఫైబర్ వస్తుంది. అందుకే క్విల్టులు, దుప్పట్లు, టవల్సు, టీషర్టులు, చీరెలు, ఫ్రాక్సు.. ఇలా అన్ని రకాల దుస్తులకీ ప్రాసెస్ చేసిన వెదురునారని వాడుతున్నారు. ఇవి వేసవిలో చల్లదనాన్ని, చలికాలంలో వెచ్చదనాన్ని అందిస్తాయనీ, వెదురుకి సహజంగా ఉండే యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ గుణాల వల్ల ఒంటికి మేలు చేస్తాయనీ చెబుతున్నారు.



### ఆరోగ్యానికి మంచిది

కాసిన్ని వెదురు పిలకల్ని తీసుకుని సన్నగా కోసి కొబ్బరి పాలల్లో ఉడికించుకుని తింటే ఆ రుచే వేరు.. అంటున్నారంతా. ఒకప్పుడు ఆగ్నేయాసియా దేశాల్లో, గిరిజన తెగల్లో మాత్రమే వాడుకలో ఉన్న వెదురుపిలకలు ఆరోగ్యానికి మంచివని చాలా మంది తింటున్నారిప్పుడు. ఇవి కొద్దిగా తిన్నా కడుపు నిండుతుంది. క్యాలరీలు తక్కువ. దాంతో బరువు తగ్గాలనుకున్న వాళ్లకు మేలు జరుగుతుందన్నమాట. లేత వెదురుకాడల్లో ఖనిజాలు, ఇతరత్రా పోషకాలు అధికంగా ఉండటంతో రోగనిరోధక శక్తినీ పెంచుతాయి. వెదురు



చిగుళ్లతో ఊరగాయ కూడా పెట్టుకుంటారు కొంతమంది. ఈ చిగుళ్లతో తయారు చేసిన కషాయం చలువ చేస్తుంది. దీన్ని సంప్రదాయ, ఆయుర్వేద వైద్యులు కఫం, మూల వ్యాధి, మధుమేహ నివారణకు, ఆకలికి, గర్భకోశ శుద్ధికీ ఉపయోగిస్తారు. దీన్ని కాల్చినప్పుడు వచ్చిన బొగ్గుని ఆరోగ్యకరంగా భావించి ఆహారోత్పత్తుల్లోనూ వాడుతున్నారు.

### ఆదాయమూ వస్తుంది..

వెదురులో వందలకొద్ది జాతులు, వేలకొద్ది రకాలున్నాయి. ఆకుపచ్చతో పాటు నారింజ, ఎరుపు, పసుపు, నలుపు రంగుల్లోనూ వెదురు పండుతోంది. అయితే మన దగ్గర ఎక్కువగా పసుపు రంగులోని మాంగా, భీమ, జెయింట్, బెంగాల్, బర్మా రకం వెదురునే పెంచుతున్నారు.



మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలోని రైతులు వెదురు నుంచి ఏటా కొన్ని కోట్ల ఆదాయం పొందుతున్నారట. ఒక్కసారి వెదురుమొక్కను నాటితే నాలుగేళ్ల నుంచి దశాబ్దాల పాటు ఆదాయం వస్తూనే ఉంటుంది. ఎదిగిన వెదురుని కొట్టేయగానే దాని పక్కనే పిలకలు వస్తాయి. కనుక మళ్లీ మళ్లీ విత్తనాలు నాటాల్సిన అవసరం లేదు. కానీ ఇతర పంటల మాదిరి దీనిని సంరక్షించాలంటున్నారు నిపుణులు. దీని ఆకులు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తోంది. ❏





కథ

# బావిలో బంగారు నిధి

ఆశాపురం ప్రజలు మంచినీళ్ల లేక కరువుతో అల్లాడుతున్నారు. చెరువులు ఎండిపోయాయి. మంచినీళ్ల తాగేందుకు ఒక బావి కూడా ఆ ఊళ్లో లేదు. పాలకులు తమను పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శలు కురిపిస్తూ కాలం వెళ్లబుచ్చసాగారు. పాలకుల నుండి అయాచితంగా వచ్చే పథకాలను అనుభవిస్తూ చాలా మంది సోమరుల్లా తయారయ్యారు.

ఆ గ్రామానికి చెందిన చైతన్య విదేశాలలో ఉన్నత చదువులు పూర్తి చేసుకుని గ్రామానికి వచ్చాడు. మంచినీళ్ల కోసం గ్రామ ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లడం చైతన్య గమనించాడు. ఈ సమస్యకు పరిష్కార మార్గం వెతికేందుకు యువతను సమావేశపరిచాడు.

"గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించడానికి మనమే ఒక బావిని తవ్వుకుందాం" అన్నాడు చైతన్య.

"అది పాలకుల పని. మనం దానిని తవ్వితే ఆ ఖర్చును ఎవరు భరిస్తారు? పాలకులే ఆ ఖర్చును భరించి మన సమస్యకు పరిష్కారం చూపాలి" అన్నాడో పెద్ద మనిషి.

"ఎవరో వస్తారని ఏదో చేస్తారని మనం ఎంత కాలం ఎదురు చూస్తాం బాబాయ్. విదేశాల్లో చదువుకుంటూ దొరికిన ఖాళీ సమయాల్లో ఏదో ఒక పని చేసి కొంత డబ్బు కూడబెట్టాను. బావి తవ్వే ఖర్చును నేను భరిస్తాను. మనమే దానిని తవ్వుకుందాం. బావిని తవ్వడానికి నాకు కొందరు యువకులను అప్పగించండి. వారికి రోజువారీ కూలీ ఇచ్చి దానిని తవ్విస్తాను" అన్నాడు చైతన్య.

అయాచితంగా వచ్చే పథకాలను ఉపయోగించుకుని పని చేయడం మానేసి సోమరిపోతుల్లా మారిన యువకులెవరూ బావిని తవ్వడానికి ముందుకు రాలేదు. చైతన్య చాలా ప్రయత్నించాడు. రెట్టింపు కూలీ ఇస్తానని ఆశ చూపినా ఎవరూ ముందుకు రాలేదు. చైతన్య ఒక్కడే కొద్ది రోజులు కష్టపడి బావిని తవ్వాడు. కానీ నీళ్ల పడలేదు. అతి పెద్ద బండరాయి బయట పడింది.

ఆ బండరాయిని తొలగిస్తే బావిలో నీళ్ల పడతాయని, తనకుసాయం చేయమని చైతన్య చాలా మందిని బతిమిలాడాడు. అందుకు ఏ ఒక్కరూ ముందుకు రాలేదు.

చేసేది లేక చైతన్య దిగాలుగా బావి వద్ద కూర్చున్నాడు. అతనికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

మరుసటి రోజు ఊళ్లో చురుకుగా ఉంటే అయిదుగురు పిల్లలను ఎంపిక చేసి ఒక్కొక్కరికి ఒక్కో బంగారు నాణెం ఇచ్చాడు చైతన్య.

"బావిలో బయట పడిన బండ చుట్టూ ఈ బంగారు నాణేలు దొరికాయి. ఆ రాయి కింద బంగారు నిధి ఉన్నట్లు నేను కనిపెట్టాను. ఈ రాత్రికి నేను బండను తొలగించి దాని కింద వున్న బంగారు నిధిని సొంతం చేసుకుంటాను" అని పిల్లలకు చెప్పాడు చైతన్య.

ఈ విషయాన్ని పిల్లలు ఊరంతా చెప్పారు.

అది విన్న కొందరు యువకులు బావిలోని బంగారు నిధిని సొంతం చేసుకోవాలని పోటాపోటీలుగా పలుగులు, పారలు తీసుకుని వెళ్లి చాలా శ్రమకోర్చి ఆ బండరాయిని పగులగొట్టారు. అక్కడ వారికి బంగారు నిధి దొరకలేదుగానీ పెద్ద జల పడింది. నీళ్ల ధారాపతంలా పెల్లుబికి పైకి వచ్చాయి. యువకులు నిరాశ చెంది చైతన్యముందు సిగ్గుతో తల దించుకున్నారు. బావిలో నీటిజలకు అడ్డుగా ఉన్న రాయిని తొలగించడానికి ఇదంతా చైతన్య ఆడిన నాటకమని యువకులకు అర్థమైంది. బావిలో మంచినీరు పడటమే అసలైన బంగారు నిధి అని భావించిన గ్రామస్తులంతా సంతోషించారు.

తన ఎత్తు పారినందుకు చైతన్య ఆనందపడిపోయి ఉద్యోగ ప్రయత్నంలో నగరానికి వెళ్లిపోయాడు.

ఆ రోజు నుండి యువకులంతా ఎవరో వచ్చి గ్రామానికి మేలు చేస్తారని ఎదురు చూడకుండా, అయాచితంగా వచ్చే సొమ్ముకు ఆశ పడకుండా కష్టపడి పని చేసి తమ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుని ఆదర్శ గ్రామంగా తయారు చేశారు.

- షేక్ అబ్దుల్ హాకీం జాని

## బాలగేయం

### క్రిస్మస్ గ్రీటింగ్స్



హ్యాపీ హ్యాపీ క్రిస్మస్
ఊరంతా సందడిగా..
క్రీస్తు పుట్టిన వేడుకను
జరుపుకుంటున్నది
చర్చిలన్నీ బెలూన్లతో
అలంకరించబడ్డాయి
కొత్త బట్టలతో
నోరూరించే కేకులతో
విందారగిచ్చి
కేరింతలాడుతూ
చర్చికి వెళ్లి
ప్రభువును ఆరాధిస్తాం
స్నేహితులతో కలిసి
అందరికీ క్రిస్మస్
గ్రీటింగ్స్ చెబుతాం
సాయంత్రం వరకు
ఆనందంగా గడిపి
ఇండ్లకు వెళ్లిపోతాం.

## హాలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.జానకి,** వేములవాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కంప్యూటర్ వైరస్ అంటే ఏమిటి?**

**జవాబు: జానకి!** కంప్యూటర్ వైరస్ అనేది ఒక రకమైన ప్రోగ్రామ్. ఎటువంటి కమాండ్‌తో నిమిత్తం లేకుండా తనంతట తాను కంప్యూటర్‌ను తొలచివేయడం ఈ ప్రోగ్రామ్(వైరస్) ప్రత్యేకత. హార్డ్ డిస్క్, ఫ్లాపీ డిస్క్‌లుగా పిలిచే సిస్టమ్ ఏరియా (ఎగ్జిక్యూటివ్ ఫైల్స్)లోకి ప్రవేశించిన వైరస్ అందులోని ప్రోగ్రామింగ్ ఫైల్స్ అన్నింటినీ కాపీ చేస్తుంది. అలా కాపీ చేసిన ఫైళ్లను ధ్వంసం చేసి మరిన్ని ఫైళ్లను కాపీ చేస్తుంది. ఈ రకంగా కంప్యూటర్‌లోని అన్ని విభాగాలకు విస్తరించి మొత్తం సిస్టమ్‌ను ధ్వంసం చేయడమే వైరస్‌ల ప్రత్యేకత. వార్మ్స్/ట్రోజాన్స్ వంటి రకాల వైరస్‌లలో కొన్ని మెయిల్స్ రూపంలో కంప్యూటర్‌లోకి ప్రవేశిస్తాయి. మెయిల్‌ను ఓపెన్ చేయగానే అవి కంప్యూటర్‌లోని ప్రోగ్రామ్ ఫైళ్లను ధ్వంసం చేసే కార్యక్రమం ప్రారంభిస్తాయి. కొన్ని వైరస్‌లు హార్డ్ డ్రైవ్స్ మీద కూడా విశృంఖలంగా దాడి చేసి, పనితీరును అదుపులో ఉంచుకుంటాయి.

**- పి.వాసుదేవరావు,** గుంటూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నిద్ర పోయినంతసేపు మెదడుకు ఆ నిద్ర ఉపయోగపడుతుందా?**

**జవాబు: వాసుదేవరావు!** మనం నిద్రపోయిన గంటల కాలాన్ని లెక్క వేసి, అంత కాలమూ నిద్ర పోయామనుకోవడం కేవలం ఒక భ్రమ మాత్రమే. వాస్తవంగా నిద్ర పోయేది నిద్రాకాలం కంటే తక్కువే. కలత నిద్ర పోయినవారు ఆ రోజు తమకు నిద్ర సరిగా పట్టలేదని విచారిస్తుంటారుగానీ, వాస్తవానికి బాగా నిద్ర పోయామనుకునేవారు కూడా తమ లెక్క కన్నా తక్కువ సమయమే నిద్ర పోయారన్నది వాస్తవం. ఎవరికైనా తాము నిద్ర పోయామనుకున్న కాలంలో ముప్పాతిక వంతు మాత్రమే నిద్రపోతారు. ఈ ముప్పాతిక కాలంలో పావు వంతు మాత్రమే గాఢనిద్ర (సౌండ్ స్లీప్) పోతారు. ఈ సమయంలోనే ఆ నిద్ర మెదడుకు సాయపడుతుంది.



# మహిళలకు పెద్ద పీట వేస్తున్న ప్రకటనలు

ఇటీవల అమీర్‌ఖాన్, కియారా అద్వానీ కలిసి నటించిన ఒక ప్రైవేటు బ్యాంకుకు సంబంధించిన వ్యాపార ప్రకటన సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారింది. మన దేశంలోని వాణిజ్య సంస్థలు తమ వ్యాపార ప్రకటనలలో మహిళలను ఉపయోగించుకోవటం కొత్తేమీ కాదు. బీడీ కట్టల నుండి బీరు సీసాల అమ్మకాల వరకు వ్యాపార సంస్థలు ఇచ్చే ప్రకటనల్లో మహిళలే ఎక్కువగా మనకు తారసప డుతుంటారు. కొన్ని సందర్భాలలో ప్రకటనలలో కనపడే వ్యాపార వస్తువులకు మహిళలకు సంబంధం ఏమిటో ఎంత తల బాదుకున్నా అర్థం కాదు. కేవలం వ్యాపార ప్రకటన అందంగా, ఆకర్షణీయంగా ఉండటం కోసం మహిళలను వాడుకోవడం పరిపాటిగా మారిపోయింది. కొన్ని లో దుస్తులకు సంబంధించిన, అత్తరు కంపెనీలకు చెందిన, మద్యం కంపెనీలకు చెందిన కొన్ని వ్యాపార సంస్థల ప్రకటనలు మహిళలను తలెత్తుకుని తిరగనీయకుండా చేస్తున్నాయనటంలో ఏ సందేహం లేదు. ఒక ఆడపిల్ల తన 17వ పుట్టినరోజు వచ్చేవరకు ఇటువుంటి కొన్ని లక్షల ప్రకటనలను చూడటం వల్ల, ఆ ఆడపిల్ల మనసులో సమాజంలో ఆడవాళ్లకు ఎటువంటి స్థానం ఉందో బలమైన ముద్ర పడిపోయి, ఆత్మన్యూనతా భావంతో మానసికంగా కుంగిపోయే ప్రమాదం లేకపోలేదని అంతర్జాతీయ బ్రాండ్ మార్కెటింగ్ దిగ్గజం పార్కిన్



పేర్కొంటున్నారు. అప్పుడప్పుడు ఒకటో అరో వ్యాపార సంస్థలు ఇచ్చే ప్రకటనలు మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే కాక వారిని సాధికారత వైపు నడిపించే దిశగా ఆలోచింపజేస్తున్నాయి. అటువంటి కోవలోకి వచ్చేదే ఇటీవల ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఇచ్చిన ప్రకటన.

ఇంతకీ ఈ వ్యాపార ప్రకటనలో ఏముందంటే.. అమీర్‌ఖాన్, కియారా అద్వానీ ఇద్దరూ కొత్తగా పెళ్లయిన జంట. పెళ్లి మండపం నుండి వధువు ఇంటికి వస్తూ, తమ పెళ్లిలో ఎవరూ కన్నీరు పెట్టకుండా తమకు వీడ్కోలు పలకడంతో సంతోషంగా ఉందని ఒకరికొకరు చెప్పుకొని ఆనందపడతారు. అంతేకాకుండా వధువు ఇంట్లోకి అడుగు పెడుతూ అమీర్‌ఖాన్ ముందుగా కుడికాలు లోపల పెట్టి గృహ ప్రవేశం చేస్తాడు. నిజానికి ఈ ప్రకటన సమాజంలోకి ఒక గొప్ప సందేశాన్ని మోసుకుపోవడమే కాక మన హిందూ సాంప్రదాయాలకు విరుద్ధంగా కనబడటం వల్ల వార్తల్లో నిలిచింది. సంప్రదాయాల సంకెళ్ల, కట్టుబాట్ల కళ్లగంతలు తొలగిస్త సమాజంలో స్త్రీ, పురుషులు ఇరువురు కూడా సమానమేనని, పెళ్లయిన తర్వాత కుటుంబ బాధ్యతలు మోయటంలో ఇరువురికి సమాన బాధ్యత ఉందని తెలియజేసే గొప్ప వ్యాపార ప్రకటన ఇది. వేదికలపై మహిళా హక్కుల గురించి అనర్గళంగా ఉపన్యాసాలు ఇచ్చే మేధావులు సైతం తమ ఇళ్ల దగ్గర సాంప్రదాయాలకు కట్టుబడిన వారిని చులకనగా చూడటం మన సమాజంలో తరచుగా కనిపిస్తుంది. అటువంటివారి కళ్లు తెరిపించే ప్రయోగం ఇది. ఇంతకుముందు కూడా ఇటువంటి ప్రకటనలు అప్పుడప్పుడు పత్రికల్లోనూ, టీవీల్లోనూ కనిపిస్తూ సమాజాన్ని ఆలోచింపచేయటంలో సఫలీకృతం అయ్యాయి. హేవల్స్ కంపెనీకి చెందిన(హవా బదలగీ) 'గాలి మారుతోంది' అని అర్థం వచ్చే ప్రకటనలో ఒక జంట రిజిస్టర్ ఆఫీసుకి వెళ్తుంది. రిజిస్టర్



పేరో లేక భర్త పేరు ఉండటం సర్వసామాన్యం. కానీ ఒక మగాడు తన పేరు పక్కన తన భార్య పేరు రాసుకోవడం గొప్ప సామాజిక మార్పుకు, లింగ సమానతకు నిదర్శనం. అదే విధంగా ఏరియల్ బట్టల సర్ఫ్‌కు సంబంధించిన ప్రకటనలో ఒక తండ్రి తన కూతురు ఇంటి పనుల్లో ఏ విధంగా కష్టపడుతుందో అర్థం చేసుకొని, తాను కుటుంబ పనుల్లో ఏమాత్రం సహాయం చేస్తున్నాడో ఆత్మవిమర్శ చేసుకుంటూ, బట్టలు ఉతికే పని కేవలం ఆడవాళ్లది మాత్రమే కాదని మగవాడు కూడా అందులో పాలుపంచుకోవచ్చని.. అప్పటినుండి భార్యకు అన్ని ఇంటి పనుల్లో సహాయపడతాడు. ఈ ప్రకటన కూడా ఇంటి పనులు, వంట పనులు కేవలం ఆడవాళ్లకే పరిమితం కాదనీ, మగవాళ్లు కూడా కొంత భరించాల్సిన అవసరం ఉందనే సత్యాన్ని చెప్పకనే చెబుతుంది.

వాచీలకు చెందిన కంపెనీ టైటాన్ తన కొత్త వాచీలు టైటాన్ రాగా కోసం ఇచ్చిన వాణిజ్య ప్రకటన 'ఆమె జీవితం ఆమె ఇష్టం' మహిళలు తమ జీవితం పట్ల ఎంత స్పష్టంగా వున్నారో తెలియజేస్తుంది. ఈ ప్రకటనలోని మహిళ జీవితంలో ఏమాత్రం భయపడకుండా తన ఇష్టా ఇష్టాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో తెలియజేస్తుంది. మహిళా సాధికారతకు ఈ ప్రకటన పెద్ద పీట వేస్తుంది.

అదేవిధంగా ఎయిర్టెల్ బాస్ ఇచ్చిన ప్రకటనలో.. మహిళలు ఆఫీసులో తమ తెలివితేటలతో తన కింద స్థాయి ఉద్యోగులను ఏ విధంగా కుటుంబం మొత్తాన్ని తన చెప్పుచేతల్లో పెట్టుకుని సరైన దారిలో నడిపిస్తుందని అర్థం స్ఫురిస్తుంది. వ్యక్తిగత జీవితాన్ని వృత్తిపరమైన జీవితాన్ని ఏ విధంగా మహిళలు ఎంతో అందంగా తీర్చిదిద్దుకుంటారు అని ఈ ప్రకటన మనకు తెలియజేస్తుంది. ఫోర్డ్‌కు సంబంధించిన ప్రకటన సాంప్రదాయాల్ని తోసిరాజనటంలో మరొక అడుగు ముందుకు వేసింది. రక్షాబంధనం రోజున కల్కి అనే మహిళ తనకు తానే రాఖీ కట్టుకుంటూ తన భద్రత, రక్షణ పూర్తిగా తనదేనని తన సోదరుల మీద ఏమాత్రం ఆధారపడనని ఆత్మస్థైర్యంతో చెబుతుంది. నిజంగానే నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఆడపిల్ల ఇంకొకరి మీద ఆధారపడకుండా ధైర్యంగా తమకు తామే రక్షకులై నిలబడాలి. ఈ వ్యాపార ప్రకటనలన్నీ సంప్రదాయాలను పక్కనపెట్టి సమాజంలో ఆధునిక మహిళ ఏ విధంగా మహిళలు మగవాళ్ల కన్నా ఏమాత్రం తక్కువ కాదనే సందేశంతో ముందుకు వెళుతూ మహిళల ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేవిగా ఉంటున్నాయి.



దురదృష్టవశాత్తు ఇటువంటి ప్రకటనల పట్ల మత ఛాందసవాదులు, కుహనా మేధావులు, పితృస్వామ్య పరిరక్షకులు, పురుషహంకారులు మాత్రం తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మతంలోని మూఢనమ్మకాలు ఉపయోగించి మన వ్యవస్థ మొత్తాన్ని చిన్నాభిన్నం చేశారు మూర్ఖపు



అతివాదులు. ఆడదాన్ని ఆట వస్తువుగా చూడబట్టే ఇప్పటికీ దేశంలో భ్రూణ హత్యలు, లైంగిక దాడులు, మహిళలు అక్రమ రవాణాకు అంతు లేకుండా పోతుంది. మహిళా సాధికారతకు మహిళా సమానత్వానికి పెద్ద పీట వేసే వ్యాపార ప్రకటన పట్ల నిరసనలు తెలియజేసే బదులు, ఆడవాళ్ల పట్ల జరుగుతున్న అన్యాయాలపై దృష్టి పెడితే సమాజం బాగుపడుతుంది. ముఖ్యంగా పెద్ద పెద్ద చదువులు చదివినవాళ్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, సినిమా నటులు, రాజకీయ నాయకులు వేదికల పైన ఉపన్యాసాలు ఇవ్వటం తోనే సరిపోదు, తమ దైనందిన జీవితంలో మహిళలకు గౌరవం వచ్చి నప్పుడే నిజమైన సంస్కారం కలవారిగా గుర్తింపు పొందుతారు.

ఇప్పటికైనా ప్రతి రంగంలో మహిళలు ఏ విధంగా అణగదొక్కబడుతున్నారో, వారి హక్కులను ఏ విధంగా హరించబడుతున్నాయో తెలియజేసే ప్రకటనలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కనీసం ఇటువంటి ప్రకటనలు చూసైనా సమాజంలోని కొంత మందైనా మారకపోరు. నిజానికి పైన చెప్పిన ప్రయివేటు బ్యాంకు ప్రకటనలో అమీర్‌ఖాన్‌కు బదులు హిందూ సినీ నటుడు ఎవరైనా నటించి ఉంటే, మతవాదుల విమర్శల తీరు మరొక రకంగా ఉండేది. మన దేశంలో మతాలకు అతీతంగా మహిళలను చిన్న చూపు చూస్తున్నారనేది వాస్తవం. మహిళా సాధికారత అనేది మతాలకు అతీతమైన అంశం అని అందరం గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**- ఈదర శ్రీనివాసరెడ్డి**

కథ

# కుక్కతోక

**బొందల నాగేశ్వరరావు**

**“అబ్బబ్బా! ఎందుకు నాకీ కష్టం! ప్రభుత్వం విరమణ చేసి ఇంటికి పంపినా నీ నిర్వాకం నుంచి విముక్తి దొరకడంలేదే! ఇదిగో నిత్యం నేనీ వంటపని చేయలేను. నువ్వూ చేసుకోలేవు. కనుక ఇప్పుడైనా సరే.. వంట చేయటానికి ఓ పనిపిల్లను పెట్టుకో కాంతం! ప్లీజ్..” భార్యతో అన్నాడు రమణారావు.**

“కుదరదండీ! మీరే చెయ్యాలి. ఎందుకంటే దాదాపు ముప్పై ఏళ్ల మీరు నన్ను ఏడిపిస్తూ మీ ఆఫీసులోని ఆడాళ్లతో హాయిగా తిరుగుతూ ఆనందించారు. అందుకని పనిష్మెంటు రూపంలో మిమ్మల్ని మనింట్లో కిచెన్‌కు పరిమితం చేశాను, తప్పదండీ... సుఖం కొన్నాళ్లు, కష్టాలు కొన్నాళ్లని నా ఏడ్పే మిమ్మల్ని మనింటి కిచెన్ వరకు తీసుకువచ్చింది. వెళ్లండి కిచెన్‌లోకి” దబాయింపు ధోరణితో అంది భార్య సూర్యకాంతం.


“లేదు కాంతం! ఆఫీసు పనంటే ఎంతైనా చెస్తానే! ఈ వంట చేయటమేమిటే నా బొంద! ఇదిగో.. నువ్వూ అరవై ఏళ్ల ముసలమ్మవి. పైగా ఉబకాయం. నేనూ అంతేలే. ఇద్దరం దొందూ దొందేనన్న చందాన వున్నాం. కనుక దయచేసి ఓ పనిపిల్లను పెట్టుకో. జీతం పది వేలైనా సరే నేనిస్తాను, ప్లీజ్” సూర్యకాంతాన్ని నైస్ చేస్తూ అన్నాడు.

ఉబకాయంతో పాటు ఎత్తులో తాటిచెట్టుకు తీసిపోని రమణారావు.

“అబ్బో..! అంటే పనిపిల్లకు జీతం ఎంతైనా ఇస్తారు కానీ వంటపని చేయరన్నమాట. కుదరదండీ! మీరే చెయ్యాలి. మిమ్మల్ని నమ్మలేనండీ. ఛాన్సటే దొరికితే ఇది ఇల్లని కూడా మరిచిపోయి ఆ వచ్చే పనిమనిషితో కులికేస్తారు మీరు. తప్పే.. భర్త చేత వంట చేయించటం తప్పే! మరేం చేయను? మీరు నాతో ఆడుకొంటూ నా జీవితం మొత్తం ఏడిపించారే” కళ్లలోకి చూసి అంది.

“పోనీలే కాంతం! గతాన్ని తవ్వకు. నా మాట విని పనిమనిషిని పెట్టుకో. నేను మునుపటిలా లేను. పూర్తిగా మారిపోయానే!” సూర్యకాంతం కళ్ల నుంచి తప్పించుకొని బతిమాలాడు.

“మీ మీద నాకింకా నాక నమ్మకం కుదరలేదండి. వయసు మళ్లినా ఆడాళ్లను చూస్తే ఎంచక్కా వాళ్లను వశపరచుకొని ఆడుకొంటారు. పళ్లికిలిస్తూ వాళ్లతో మీ కృష్ణలీలలను సాగిస్తారు. ఆపై నాకు కోపం వస్తుంది. వస్తే తప్పనిసరిగా అట్లకాడకు బుద్ధి చెప్పాల్సిన పని వస్తుంది. అది అవసరమంటారా? చెప్పండి” అడిగింది.



“లేదు కాంతం. నువ్వనుకొంటున్నట్టు నేనిప్పుడు లేనని చెప్పానుగా. వయస్సు భారంతో అన్నిటిని మరిచిపోయాను. నన్ను వదిలేయ్! ఇదిగో ఈ కాఫీ నీకు నేను ఇస్తున్న చివరి కాఫీగా చేసుకో! ప్లీజ్” అంటూ గడ్డం పట్టుకుని బతిమాలుతుంటే సూర్యకాంతానికి నవ్వొచ్చి వెళ్లి సోఫాలో కూర్చుంది.

గరిటెను చేత పట్టుకొని ఆమె వెనకాలే వెళ్లి ఏదో తప్పు చేసినవాడిలా చాలా మర్యాదగా చేతులు కట్టుకొని నిలుచున్నాడు రమణారావు.

కాఫీని మెల్లగా సిప్ చేస్తూ భర్తను ఎగాదిగా చూసి “అబ్బో! నా మీద ప్రేమ, వినయమున్నట్టు చక్కగా భయం నటిస్తున్నారులా వుంది” ముఖాన్ని క్వశ్చన్ మార్కుతో పెట్టుకొని అడిగింది సూర్యకాంతం.

“అరె! నిజంగా నేను మరిచిపోయానమ్మా. నువ్వనుకొంటున్నట్టు పదేళ్ల క్రితం ఆఫీసరుగా వున్నప్పుడు ఆడ స్టాఫ్‌తో క్లోజ్‌గా వున్నది నిజమే. వాళ్లతో మాల్స్ కు, సినిమాలకు, బీచ్‌లకు సోగ్గాడిలా తిరిగాను. అదీ నిజమే! ఇప్పుడు ఆ పాత చరిత్రను మనసులోంచి తుడిచి పారేశాను. వాటన్నిటికి దూరంగా బుద్ధిగా వుండడమే గౌరవమనుకొని వుంటున్నాను. నన్ను నమ్ము కాంతం” గడ్డం పట్టుకొని బతిమాలాడు.

“మిమ్మల్ని చూస్తే జాలేస్తుందండీ! వినండి.. వంట చేయటానికి మీరు పడుతున్న పాట్లను గమనించిన నేను మొన్ననే వంట చేసి పెట్టే ముగ్గురాడాళ్లను ఇంటర్వ్యూ చేసి లక్ష్మి అన్న ఒకామెను సెలక్టు చేసి ఇవాళ్టినుంచే పనిలోకి రమ్మన్నాను. వస్తుంది. మీరు కాస్త వాళ్ల దగ్గరుంచుకుని వచ్చే వంటమనిషి పట్ల జాగ్రత్తగా యజమాని ధోరణితో నడుచుకోండి. సొల్లు కబుర్లతో పిచ్చి పిచ్చి వేశాలేయకండి. ఒకవేళ ఏదైనా తేడా జరిగిందో.. మళ్లీ మీరు ఆ వంటగదికే పరిమితమౌతారు. తెలిసిందా?” అని గడ్డం పట్టుకొని లాలనగా అంటూ ఇటూ ఆడించింది.

రమణారావు ముఖంలో థౌసెండ్ వాట్స్ బల్బు వెలిగింది. చేతిలో వున్న గరిటెను వంటగదిలోకి విసిరికొట్టి సంతోషమనే ప్రవాహంలో మునిగితేలుతూ–

“నాకు వంట చేయటం నుంచి విముక్తి కలిగిందోచ్” అని పెద్దగా అరిచి మళ్లీ మెల్లగా “నాకు థాంక్స్ కాంతం. బుద్ధిగా వుంటాను... ఇంతకూ నువ్వు సెలక్టు చేసింది ఆడదాన్నా? అమ్మాయినా?” మనిషి వంకర్లు తిరిగిపోతూ అడిగాడు.

“అదిగో! మీ బుద్ధిని పోనిచ్చుకున్నారు కాదు. మీ దృష్టిలో ఆడదంటే నలభై, యాభై ఏళ్లవాళ్లని అమ్మాయంటే ఓ ఇరవై ఏళ్ల లోపలని అర్థం. అంతేగా!”

ప్రశ్నించింది.

ఆ ప్రశ్నలోని అంతరార్థం అర్థం చేసుకున్న రమణారావు "ఊహూ.." అని తల అడ్డంగా ఊపి "అదేంలేదు కాంతం! అమ్మాయిలైతే వంట చకచక చేస్తారు కదాని" దీర్ఘం తీశాడు.

"ఆహా! పిచ్చి లాజిక్కులతో పళ్లికిలించక బుద్ధిగా వుండండి. ఆ ఈజీ చైర్లో కూర్చొని ఏ రామాయణమో లేక మహాభారతమో చదువుకోండి, వెళ్లండి" కటువుగా వచ్చాయా మాటలు.

"ఏంటి కాంతం! అలా కసురుకొంటావ్? నీకు నా మీద ఇంకా సందేహమే. పోనీ కాస్సేపు ఆ టీవీ చూసుకుంటానే!" బతిమాలాడాడు.

"కుదరదు.. అందులో ఫ్యాషన్ టీవీ పెట్టుకొని చూస్తూ పళ్లికిలిస్తారు. వెళ్లి రామాయణం చదువుకోండి.. పొండి" అంటూ డ్రస్సింగ్ టేబుల్ ముందుకు వెళ్లిపోయింది సూర్యకాంతం.

ఇక చేసేదిలేక ఉస్సూరంటూ ఈజీ చెయిర్లో కూర్చుని రామాయణం పుస్తకాన్ని గుండెల మీదుంచుకొని కళ్లు మూసుకున్నాడు రమణారావు.

రమణారావు సూర్యకాంతం దంపతులకు పెళ్లయి నలభై ఏళ్లు. వాళ్లకు ఇద్దరు పిల్లలు. ఓ బాబు, ఓ పాప. ఇద్దరినీ బాగా చదివించి ఇంజినీర్లను చేశారు. ఉద్యోగాల్లో వుంచి, పెళ్లిళ్లు చేసి అమెరికాలో సెటిల్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వపు రెవెన్యూ డిపార్టుమెంటులో గుమాస్తా నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఆఫీసరుగా చేసి రిటైర్డ్ అయిన రమణారావు సంవత్సరం నుంచి ఇంట్లోకి వంటగదికి పరిమితమయ్యాడు.

పాపం రమణారావు.. సర్వీసులో ఆఫీసరుగా వున్నప్పుడు ఆడవాళ్లన్న సీతాకోక చిలుకల మధ్య ఓ తుమ్మెదలా తిరుగుతూ, అందర్నీ మచ్చిగ చేసుకొని వాళ్లతో స్టార్ హోటల్లలో తింటూ, జల్సాగా మాల్స్‌లో సినిమాలు చూస్తూ ఆనందించేవాడు. ఒక్కోసారి జీతంపైసలు సైతం కాజేసుకొని తెల్ల మొహం పెట్టుకొని ఇంటికొచ్చేవాడు. జీతం పైసలు తేకుండా ఇంటికొచ్చే రమణారావు మీద భార్య సూర్యకాంతం కోప్పడి అందుకు పనిష్మెంటుగా తిండి పెట్టకపోతే పస్తులు కూడా వుండేవాడు. ఆ రోజుల్ని ఇప్పుడు గుర్తుకు తెచ్చుకొని గతం గతః అనుకొంటూ తను చేస్తున్న వంటకు స్వస్తి చెప్పే గడియకోసం ఎదురు చూస్తూ వచ్చాడు. అలాగే పండగపూట కూడా పాతమొగుడేనన్న చందాన ముప్పై అయిదేళ్లుగా చూస్తున్న సూర్యకాంతం ముఖాన్నే చూస్తూ, అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డులా మాట్లాడిన మాటల్నే ఆమెతో మాట్లాడుతూ బోరెత్తిపోయిన రమణారావు ఇప్పుడు కాస్త మార్పును కోరుకోవటంలో తప్పు లేదనుకున్నాడు. అదృష్టంకొద్దీ ఆ మార్పేదో తనకు ఇవాళ్టినుంచే ప్రారంభం కానుందన్న కుతూహలంతో ఎవరికీ తెలీకుండా రహస్యంగా మనసులోనే నవ్వుకున్నాడు.

సహజంగా సూర్యకాంతం బజారుకెళ్లిందంటే తిరిగి రావటానికి కనీసం మూడు గంటల సమయం పడుతుంది. తన అదృష్టంకొద్దీ అది కూడా ఇవాళే ఇప్పుడే జరగబోతుందని ఆనందపడ్డాడు రమణారావు. సూర్యకాంతం బజారుకెళుతూనే ఒక్క నిమిషం కూడా వ్యర్థం చేయకుండా మొత్తం సమయాన్ని తనకు అనుకూలంగా మలచుకొని కొత్తగా వచ్చే పనిమనిషితో రొమాన్సుకు ఉపయోగించుకోవాలని నుకున్నాడు.

**"ఒకే! పని, జీతం గట్రా అమ్మగారు నిన్నే చెప్పారు కనుక స్ట్రెయిట్‌గా కిచెన్‌లోకెళ్లు. ములక్కాడ పప్పుచారు, దుంపల వేపుడు వేడివేడిగా చేసిపెట్టు" కళ్లెగరేస్తూ అన్నాడు.**

వెళ్లి పడక్కుర్చీలో పడుకొని నిద్ర పోతున్నట్టు వుండిపోయాడు భార్య సూర్యకాంతం బయలుదేరడాన్ని క్రీకంట గమనిస్తూ. అంటే రమణారావు ఇంకా మారలేదన్నమాట.

సూర్యకాంతం ఆటోలో కూర్చొని వీధి చివర మూల తిరుగుతూనే టక్కున లేచాడు రమణారావు. పుస్తకాన్ని గిరాటేసి చకచక బాత్ రూంలోకి వెళ్లిపోయాడు. స్నానమైన తరువాత డ్రస్సింగ్ టేబుల్ ముందుకెళ్లి ముఖానికి, వొంటికి పౌడర్‌ను దట్టించి తెల్లటి లాల్చీ, పైజామా వేసుకొని సెంటను పూసుకొని పెళ్లికొడుకులా తయారై హాల్లోకొచ్చి కూర్చొన్నాడు హీరోలా.. పనిమనిషి కోసం ఎదురుచూస్తూ.

కాలింగ్ బెల్ మోగింది. పనిమనిషై ఉంటుందని వూహించిన రమణారావు "ఎస్! కమిన్.." అన్నాడు క్రాపు సర్దుకొంటూ.

ప్రత్యక్షమైంది పనిమనిషి లక్ష్మి.






లక్ష్మిని రమణారావు ఆపాదమస్తకం చూశాడు.

దాదాపు నలభై ఏళ్ల వయస్సున్న ఆమె రమణారావు కళ్లకు ఇరవై ఏళ్ల పిల్లలా కనిపించింది.

మనసులోనే ఆనందపడిపోతూ "పేరేంటి?" స్టయిల్‌గా అడిగాడు.

"లచ్చిమి అయ్యగారూ!" దీర్ఘం తీస్తూ అంది ఎదమీది నుంచి జారిన దుప్పట్టాను స్టయిల్‌గా సర్దుకొంటూ.

"ఒకే! పని, జీతం గట్రా అమ్మగారు నిన్నే చెప్పారు కనుక స్ట్రెయిట్‌గా కిచెన్‌లోకెళ్లు. ములక్కాడ పప్పుచారు, దుంపల వేపుడు వేడివేడిగా చేసిపెట్టు" కళ్లెగరేస్తూ అన్నాడు.

"చేసిపెట్టు అంటే.. వంటైన తరువాత మీకు వడ్డించి, తినబెట్టి వెళ్లాలా అయ్యగోరూ?"

"ఆ.. అమ్మగారి స్థానమదే కదా మరి. ఆమె చేసే పనులు నువ్వూ చెయ్యాలిగా!" ఒక్కసారిగా పాత రమణారావు బయటికి తెచ్చాడు.

"అమ్మగారి స్థానమా? నాకంత భాగ్యమా?? అయితే ఒకే" అంటూ మళ్లీ దుప్పట్టాను సర్దుకొంటూ కిచెన్‌లోకి వెళ్లింది.

వంట ప్రారంభించి మధ్య మధ్యలో రమణారావుని చూస్తూ తన వాలుజడను ముందుకూ వెనక్కు వేసుకొంటోంది.

రమణారావు కూడా రామాయణం పుస్తకంలోకి తల దూర్చి చదవకుండా దొంగలా లక్ష్మినే చూస్తూ వున్నాడు 'పిట్ట లైన్లో వుంది.. ఒకే ట్రయ్ చేద్దాం" అని మనసులో అనుకొంటూ-

కాసేపైన తరువాత మెల్లగా లేచి పిల్లిలా కిచెన్ వాకిటి వద్దకు వెళ్లి-

"అవునూ..! నువ్వు ఇంత మాడ రన్‌గా వున్నావ్. మరి పేరేంటి లక్ష్మి అని. పేరు బాలేదు. నేను అనుష్కా అని పిలుస్తాను. ఒకే" అంటూ దగ్గరికెళ్లి చెయ్యి పట్టుకున్నాడు కళ్లల్లోకి చూస్తూ.

"మీ ఇష్టం" అంది.

గరిటను పక్కన పెట్టి మళ్లీ "వంటెవరు చేస్తారయ్యగోరూ" అంటూ రమణారావుకు దగ్గరై కళ్లల్లోకి చూస్తూ అడిగింది.

"తరువాత చేద్దువులే.. రా.. అలా కూర్చొందాం" అంటూ సోఫా వద్దకు నడిపించాడు కొత్త పెళ్లికూతురిని నడిపిస్తున్నట్టు.

మొదటిరోజే తన్ను తాకటానికి సందర్భం కలుగజేసిందంటే "అమ్మో! ఇకనుంచి ప్రతిరోజు తనకు పండగే పండగ" నుకున్నాడు రమణరావు.

సోఫాలో స్థలం లేనట్టు ఇద్దరూ అతుక్కుపోయి భుజాలు భుజాలు రాసుకొంటూ పిచ్చిపిచ్చిగా పనికిరాని మాటలు మాట్లాడుకొంటున్నారు పొయ్యిమీది తాలింపు మాడి మసైపోయింది కూడా గమనించకుండా!


అప్పుడు కనీసం మూడు గంటలు షాపింగ్ చేసి ఇంటికి వచ్చే అలవాటున్న సూర్యకాంతం ఠక్కున గంటలోనే ప్రత్యక్షమైంది.

ఇద్దరూ లేచి నిలబడ్డారు.

లక్ష్మి కాస్త బెరుకుతో ఇబ్బందిగా ఫీలవుతూ వుంది.

రమణారావు పళ్లికిలిస్తూ మెలికలు తిరిగిపోతూ భార్య ముఖంలోకి చూశాడు.

సూర్యకాంతానికి ఎక్కడలేని కోపం వచ్చింది.



నిమిషంలో భద్రకాళిలా మారే స్థితిని సైతం గట్టిగా తన ఆధీనంలో వుంచుకొని గబగబా కిచెన్‌లోకి వెళ్లి స్టవ్ ఆఫ్ చేసి గరిటెను తీసుకొని హాల్లోకి వచ్చింది.

పర్సులో నుంచి వంద రూపాయల నోటొకటి తీసి లక్ష్మి చేతికిచ్చి- "అమ్మాయ్! నువ్వు ఇక పన్లోకి రానక్కరలేదు, వెళ్లమ్మా" అంది.

మారుమాట్లాడకుండా బర బర వెళ్లిపోయింది లక్ష్మి.

రమణారావుకు నాలుగడుగుల దూరంలో నిలబడి వున్న సూర్యకాంతం తన చేతిలోని గరిటెను క్రికెట్ బ్యాట్‌లా భర్త పైకి విసిరింది.

టక్కున పట్టుకున్నాడు రమణారావు.

"కుక్కతోక వంకరండి! దాన్ని తిన్నగా చేయటం ఎవరి తరం కాదు. అందుకే 'పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతోకాని పోదని' అంటారు.

మిమ్మల్ని మార్చే ప్రయత్నంలో భాగంగా తప్పకుండా మీలో మార్పు వస్తుందని భావించి, మిమ్మల్ని నమ్మి పనిమనిషిని పెట్టుకున్నాను. కానీ కాటికి కాళ్లు చాచే వయస్సులో వున్న మీకు ఆడాళ్లను వశపరచుకొనే ఆ దరిద్రపు గుణం, సొల్లు కార్చుకొంటూ వాళ్ల చుట్టూ తిరిగే మనస్తత్వం అస్సలు పోలేదు. మిమ్మల్ని నమ్మి పనిమనిషిని పెట్టుకోకూడదన్న నిర్ణయానికి వచ్చాను మళ్లీ. గరిటెను మీకు అందేలా విసిరాను. ఇక కిచెన్‌లోకి దయచేయండి" అని కాస్త గట్టిగానే అంది.

"అది కాదు కాంతం..." ఏదో చెప్పబోయాడు రమణారావు.

"ఉష్.. మాట్లాడకుండా వెళ్లండి. వంట చేయటంతో పాటు ఇకపై ఇంటిపని కూడా చేయండి. అదీ మీకు నేనిచ్చే పనిష్మెంటే సుమా!" అని అంటుండగా కిచెన్‌లోకి నడిచాడు రమణారావు.


**రచనలకు ఆహ్వానం**

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరే వారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

ఆధునికాంధ్ర కవితా సీమలో భాషలో, భావంలో, రూపంలో కొత్త పరవళ్ల తొక్కిన శ్రీశ్రీ మహా ప్రస్థానం సాహిత్యాకాశంలో ఒక ధ్రువతార. "పెను నిద్దుర వదిలించేది, మునుముందుకు నడిపించేది" ప్రత్యక్షరంగా మహాకవి శ్రీశ్రీ ప్రత్యక్షం చేసారు. ఆధునికతతో పాటు, మార్క్సిజానికి పునాది రాళ్లుగా మహా



వెల్లివిరిసింది.

"శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని" మార్క్సిజం మూల సూత్రాలు కవితాపరంగా వెల్లివిరిసాయి. మహా ప్రస్థానం ద్వారా సాహిత్య విప్లవం సృష్టించి శ్రీశ్రీ అజరామరమైన కీర్తి ప్రతిష్ఠ పొందారు.

మహా ప్రస్థానానికి ముందు మాటగా

# తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ మహా ప్రస్థానం

సాహిత్యం

ప్రస్థానం ఒక నూతన యుగానికి మార్గం చూపించింది. తెలుగులో విప్లవోత్తేజం వర్షింపచేసే, సామాజిక విప్లవ పురోగామిగా శ్రీశ్రీ తన గొంతుక వినిపించారు. శ్రీశ్రీ కవితా శిల్పానికి ప్రాణం ధ్వని. మహా ప్రస్థానం ధ్వని ప్రధానమైన శక్తితో విస్మయపరుస్తుంది.

**"నిప్పులు చిమ్ముకుంటూ**
**నింగికి నేనెగిరిపోతే**
**నిబిడాశ్చర్యంతో వీరు**
**నెత్తురు కక్కుకుంటూ**
**నేలకు నేరాలిపోతే**
**నిర్దాక్షిణ్యంగా వీరె.."**

'ఈ' అనే చిన్న ఖండికలో అద్భుతంగా ధ్వని ప్రతిధ్వనిస్తుంది.

ప్రబంధ కవితలో ప్రౌఢత్వాన్ని, భావ కవిత్వంలో జాణ లాలిత్యాన్ని ఆస్వాదించిన శ్రీరంగం శ్రీనివాసరావు ఆ భావాల పరిష్వంగం సడలించుకొని పడిన వేదన 'కవితా ఓ కవితా'గేయంలో స్ఫురింపచేసారు. 'జగన్నాథుని రథ చక్రాలలో పతితులను, భ్రష్టులను, బాధా సర్పదష్టులను, దీనులను, హీనులను ఎందరో హతాశులను ఆహ్వానించి ఈ లోకం మీదేనండి. మీ రాజ్యం మీరేలండి అంటారు. మహా ప్రస్థానంలో చాలా గేయాలకు భూమిక గీతం 'మరో ప్రపంచం' యువ ప్రపంచానికి సమరగీతం. 'పదండి ముందుకు పదండి తోసుకు 'పోదాం పోదాం పైపైకి' అంటూ "ఎముకలు కుళ్లిన వయస్సు మళ్లిన సోమరులారా చావండి" అంటూ మహా ప్రస్థానానికి పిలుపు యిస్తారు.

శ్రీశ్రీలో వున్న ప్రాచీన కవితా సంస్కారం, అలంకార నిర్మాణంలో వినూత్న పోకడలను సృష్టిస్తుంది. అద్భుతంగా స్వభావోక్తిలో 'భిక్షు వర్షీయసి' వర్ణన సాగుతుంది యిలా..

**'ముగ్గుబుట్ట వంటి తల**
**ముడుతలు తేలిన దేహం**
**కాంతిలేని గాజుకళ్లు**
**తన కన్నా శవం నయం'**

'ఆరిన కుంపటి' పోలికలో ఆమె పేదరికం, వృద్ధాప్యం, నిస్సహాయత కంటికి కనపడేటట్టు చిత్రీకరిస్తారు. మహా ప్రస్థానం కవితలలో ఉపమానాలు, నవ్యతతో మనస్సును కదిలించి కరిగిస్తాయి.

**"గదిలోపల చినుకులవలె చీకట్లు**
**పేదల కన్నులు**
**తుపానులో తడిసిన జడిసిన**
**గోమాతల కన్నుల తమ్ములు"**

నవ్యత, చమత్కృతి, శిల్పం అభ్యుదయ భావాలు జోడించిన ఆధునిక మహాకావ్యం మహా ప్రస్థానం. శబ్దానికున్న శక్తి అపూర్వ ప్రతిభతో వ్యక్తమవుతుంది.

నా కవిత్వం వ్యాసంలో శ్రీశ్రీ ఇలా అంటారు "ప్రతి మాటకు ఒక కొలత, ఒక బరువూ వుంటాయి. రెండు మాటలను సరైన ఉద్దిష్టమైన అర్థం వచ్చేటట్లు కలపటం చాలా కష్టం". శబ్దాన్ని గురించి ఆ ఆదర్శాన్ని వస్తువు, ప్రతి శబ్దం ద్వారా ధ్వనింపచేసి కవితా వైచిత్రి మహా ప్రస్థానం ప్రధాన శక్తిగా శ్రీశ్రీ అపూర్వకంగా సాధించారు.

అందుకే "అనితర సాధ్య నా మార్గం" అనగలిగారు.

గేయం నడకలో భావస్ఫూర్తి, లయతో విశిష్ట లక్షణాలతో మహా ప్రస్థానం ప్రయోగాత్మక అనంత శక్తివంతంగా వ్యక్తీకరిస్తుంది.

శ్రీశ్రీ మహా ప్రస్థానం అవతరణతో తెలుగు సాహిత్యం నాడు కలలు కంటున్న ఆధునికత, సాంఘిక పురోగమనం లక్ష్యంగా సామ్యవాదం యోగ్యతా పత్రం పేరిట చలం ప్రామాణిక పత్రం తెలుగు సాహిత్యంలో ఒక మేగ్నాకార్టగా సుప్రసిద్ధమైంది.

1950 జూన్‌లో తొలిసారిగా ప్రచురితమైన ఈ కావ్యం సప్తతి సంవత్సరం దాటింది. ఈ మహా ప్రస్థానానికి 1940 జులై 17న బెజవాడ నుంచి చలం రాసిన ఆ పీఠికకు 82 ఏళ్లు అయినా నేటికీ తెలుగు సాహిత్యంలో అటువంటి 'ముందుమాట' రాలేదు. తెలుగు వచనంలో ఉద్వేగాన్ని, ఆవేశాన్ని, ఆగ్రహాన్ని ఎలా వ్యక్తం చేయాలో ఈ పీఠిక విలక్షణ రీతిలో తెలియచేస్తోంది. మహా ప్రస్థానం గేయాలు, దిక్కుల్నీ, దేవతల్నీ, అధికారులను ఊగించి ప్రశ్నించేనని, ఈ వృద్ధ ప్రపంచానికి నెత్తురూ, కన్నీళ్లు కలిపి తయారు చేసిన కొత్త టానిక్ అన్నారు. రాబందుల రెక్కల చప్పుడు పయోధర ప్రపంచ ఘోష విని తట్టు కోగల చావ ఉంటేనే మహా ప్రస్థానాన్ని తెరవమని చలం హెచ్చరించారు.

తన గేయాల సంకలనానికి ముందుమాట రాయమని చలంను శ్రీశ్రీ అడిగితే- "కవిత్వాన్ని తూచే రాళ్ల తన దగ్గర లేవని" అన్నారు.

జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి పని గట్టుకొని చలంచేత రాయించిన యిటువంటి యోగ్యతా పత్రం యింత వరకు తెలుగు సాహిత్యంలో రానంతగా అపూర్వమైంది. 1933-1940 మధ్య కాలంలో మొత్తం 38 కవితలు శ్రీశ్రీ రాసారు.

మొత్తం 41 గీతాలతో సంపుటిగా 1950లో ప్రచురింపబడింది. విశిష్ట విలక్షణ అద్భుత కవితా మహా ప్రస్థానం, శతాబ్దాల భవిష్య కాలగమనంలోనూ సదా సజీవంగా నిలిచే అమృత కావ్యం.

**- జయసూర్య**



# బహు రుచుల జావ

**అంబలి**, జావ, పోరిడ్జ్.. ఏ పేరుతో పిలిచినా అది సూపర్ ఫుడ్డే. అందుకే ఈ సంప్రదాయ ఆహారం వినియోగదారుల అవసరాలకు తగ్గట్లుగా రెడీ టూ కుక్, రెడీ టూ ఈట్.. అంటూ సరికొత్త రూపాల్లో దొరుకుతోందిప్పుడు.

ఇదివరకటిలా జావ తాగమంటే మొహం అదోలా పెట్టాల్సిన అవసరం ఇక లేదు. ఎందుకంటే ప్రస్తుతం పండ్లూ, కూరగాయల నుంచి చాక్లెట్లూ మసాలాల దాకా.. ఇలా ఎన్నో రకాల్లో దొరుకుతోంది.

## పోషకాలు అధికం

సగ్గుజావ, రాగిజావ, గోధుమజావ, బార్లీజావ, నూకలజావ... ఇలా పేరు ఏదైతేనేం.. కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్, మినరల్స్, విటమిన్స్, ఐరన్, ఫైబర్, అయోడిన్ వంటి పోషకాలన్నీ వీటిల్లో పుష్కలంగా దొరుకుతాయి.



అంబలి తాగే అలవాటు మన దేశంలోనే కాదు, చైనా, వియత్నాం, థాయిలాండ్ వంటి ఇతర ఆసియా దేశాల్లోనూ, ఐరోపా, ఆఫ్రికా ఖండాల్లోనూ ఎక్కువే.

రాతి యుగం నుంచే ఈ పోరిడ్జ్ తాగినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. అయితే జావ తయారీలో బియ్యం సువాసన, రుచీ దేశాన్ని బట్టి మారతాయి.



చైనాలో దీన్ని కాంగీ అనీ, జపాన్‌లో ఒకే, కొరియాలో జుక్, థాయిలాండ్‌లో జోక్ అనీ పిలుస్తారు. మన దగ్గర బియ్యం, తృణధాన్యాలు, పప్పుధాన్యాలతో జావలు తయారు చేస్తే; ఐరోపా, రష్యాల్లో బార్లీని ఉపయోగిస్తారు. స్కాట్లాండ్‌లో ఓట్స్‌తో చేసే పోరిడ్జ్ చాలా ప్రసిద్ధి. చాలా దేశాల్లో ఓట్స్, బార్లీ వంటి వాటిని పాలల్లో ఉడకబెట్టి జావ తయారు చేస్తారు. ఈ మిశ్రమానికి చక్కెర, పండ్లు, సిరప్, ఉప్పు, తేనె, వెన్న, క్రీమ్ వంటివి కలిపి తింటారు.



## వివిధ రకాలు

మన దగ్గర ఒకప్పుడు బలవర్ధకమైన ఆహారంగా భావించిన అంబలి కాలక్రమేణా నిరుపేదల ఆహారంగా మారింది. క్రమంగా అన్ని వర్గాల ఆహారపు అలవాట్లలో మార్పులు వచ్చి అంబలి/జావ తాగేవారి సంఖ్య తగ్గిపోయింది. ఈలోగా కాలచక్రం గిర్రున తిరిగి జావకు మళ్లీ పూర్వ వైభవం తెచ్చిపెట్టింది. కారణం.. ఆధునిక జీవనశైలి తెచ్చిన ఆహారపుటలవాట్లు, వాటి వల్ల ముసురుకుంటున్న అనారోగ్యాలకు చెక్ చెప్పాలని జావకి జై కొడుతున్నారు. కానీ ప్రతిసారీ తమకు కావలసిన ధాన్యాలు, పప్పులతో రవ్వ తయారు చేసుకోవడం, జావ కాచుకోవడం వంటివన్నీ సమయం, శ్రమా తీసుకుంటాయి. కాలంతో సమానంగా పరుగులు పెట్టే ఈ తరానికి ఇదంతా కాస్త కష్టమైన విషయం.

ఈ విషయాన్ని గుర్తించి తయారీదారులు వినియోగదారుల అవసరాలకు తగ్గట్లుగా రెడీమేడ్ జావ ప్యాకెట్లను మార్కెట్లోకి విడుదల చేశారు. కాళ్లనొప్పులను తగ్గించే కాల్షియం రిచ్ పోరిడ్జ్, రక్తహీనతకు చెక్ పెట్టే ఐరన్ రిచ్ పోరిడ్జ్, పిల్లలకో రకం, పెద్దలకు ఇంకో రకం.. అంటూ ఎన్నో రకాలను తెచ్చేశారు.

వివిధ రకాల బియ్యం, తృణధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పులు వంటి వాటిని తగిన మోతాదుల్లో కలిపి తయారు చేసిన రెడీ టు కుక్ రకాలు, రెడీ టూ ఈట్ వెరైటీలెన్నో వచ్చేశాయి. సుగంధ ద్రవ్యాలు, కొబ్బరిపాలు, మసాలా, చాక్లెట్, వెన్న, ఖర్జూరం.. ఇలా జనం మెచ్చే రుచుల్లో జావ దొరుకుతుందిప్పుడు.

పొద్దున్నే టిఫిన్ చేసే తీరిక లేనివాళ్లు ఎంచక్కా దీన్ని తీసుకోవచ్చు. ఒకే రకమైన అల్పాహారాలతో ఇబ్బందిపడే చిన్నారులకు పోషకాల జావను తినిపించేయవచ్చు.

గ్లూటెన్ రహిత ఆహారం కావడంతో ఆరోగ్య స్పృహ వున్నవారు, బరువు అదుపులో ఉంచుకోవాలనుకున్నవారు ఈ పోరిడ్జ్ తినేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

అంబలి ఆరు నెలల పిల్లల నుంచి ఎనభై ఏళ్ల ముదుసలి వరకూ అందరూ తినగలిగే ఆహారం కావడంతో ఈ నయా ప్యాక్‌లు అందరి మనసులూ దోచుకుంటున్నాయి. మరింకెందుకు ఆలస్యం! మీరూ మొదలెట్టండి మరి.

# సింహద్వారం ఎలా నిర్ణయించాలి?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్: 9885446501/9885449458


వీధిలో నుండి ఇంట్లోకి ప్రవేశించేందుకు ఉపయోగించే ప్రథమ ద్వారాన్ని 'ప్రధాన ద్వారం' లేక 'సింహద్వారం' అంటారు.

ఇంట్లో నుండి మనం వీధిలోకి నడిచే నడక మన జీవితపు నడకనే మారుస్తుంది. ఉచ్ఛస్థానం నుండి మన నడక సాగితే బతుకు ఉన్నతమవుతుంది. నీచస్థానం నుండి నడక సాగితే బతుకూ



నీచ స్థితికి వెళ్తుంది. అందువల్ల ప్రధాన ద్వారం విషయంలో తగిన జాగ్రత్త ఒక్కసారి తీసుకుంటే దాని మంచి ఫలితాలు జీవితాంతం కనిపిస్తాయి.

## తూర్పు ముఖద్వారం

గృహానికి తూర్పున ప్రధాన ద్వారాన్ని ఏర్పాటు చేస్తే అది 'తూర్పు' ముఖద్వారం అవుతుంది. ఆ గృహానికి తూర్పున ఉన్న గదిలోపలి కొలతను సగం చేసి ఉత్తరం వైపు వచ్చే సగ భాగంలో ప్రధాన ద్వారం ఏర్పరచుకుంటే అది ఉచ్ఛస్థానంలో అమరి శుభ ఫలితాలనిస్తుంది.

## ఉత్తర ముఖద్వారం

గృహానికి ఉత్తర భాగంలో ప్రధాన ద్వారం ఏర్పాటు చేస్తే అది 'ఉత్తర ముఖ ద్వారం' అవుతుంది. ఆ గృహానికి ఉత్తర భాగంలో ఉన్న గదిలోపలి కొలతను సగం చేసి తూర్పు వైపు వచ్చే సగ భాగంలో ప్రధాన ద్వారాన్ని ఏర్పరచు కోవడం ఉత్తమం.

## పడమర ముఖద్వారం

గృహానికి పడమర ప్రధాన ద్వారాన్ని ఏర్పాటు చేస్తే దానిని 'పడమర ముఖద్వార గృహం' అంటారు. ఆ గృహానికి పడమరలో ఉన్న గదిలోపలి కొలతను సగం చేసి ఉత్తరం వైపు వచ్చే సగ భాగంలో ప్రధాన ద్వారం ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.

## దక్షిణ ముఖద్వారం

గృహానికి దక్షిణంలో ప్రధాన ద్వారాన్ని ఏర్పాటు చేస్తే అది 'దక్షిణ ముఖ ద్వార గృహం' అవుతుంది. ఆ గృహానికి

ఆ గృహానికి దక్షిణాన ఉన్న గదిలోపలి కొలతను సగం చేసి తూర్పున వచ్చే సగభాగంలో ప్రధాన ద్వారం ఏర్పాటు చేసుకోవాలి.

పై పద్ధతుల్లో ప్రధాన ద్వారం 'ఉచ్ఛం'లో అమరుతుంది.

దక్షిణంలో ఉన్న గదిలోపలి కొలతను సగంచేసి తూర్పున వచ్చే సగ భాగంలో ప్రధాన ద్వారం ఏర్పాటు చేసుకోవాలి.

పై పద్ధతుల్లో ప్రధాన ద్వారం 'ఉచ్ఛం'లో అమరుతుంది.

తూర్పున సింహద్వారం ఉచ్ఛస్థానంలో వుంటే మంచి ఫలితాలు కలుగుతాయి.

ఉత్తర సింహద్వారం ఉచ్ఛ స్థానంలో వుంటే కలిసివస్తుంది.

పడమర సింహద్వారం ఉచ్ఛస్థానంలో వుంటే అభ్యున్నతినిస్తుంది.

దక్షిణ సింహద్వారం ఉచ్ఛస్థానంలో వుంటే శుభాలు కలిసివస్తాయి.

## తూర్పు ముఖద్వార గృహాలు

గృహానికి తూర్పు భాగంలో ప్రధాన ద్వారం ఏర్పాటు చేస్తే అది 'తూర్పు ముఖ ద్వార గృహం' అవుతుంది.

ఆ గృహానికి తూర్పున ఉన్న గది లోపలి కొలతను గసం చేసి ఉత్తరం వైపు సగభాగంలో ప్రధాన ద్వారం ఏర్పరచుకుంటే అది ఉచ్ఛస్థానంలో అమరి శుభ ఫలితాలనిస్తుంది.

తూర్పున సింహద్వారం ఉచ్ఛస్థానంలో వుంటే మంచి ఫలితాలు కలుగుతాయి.

## దక్షిణ ముఖద్వార గృహాలు

గృహానికి దక్షిణంలో ప్రధాన ద్వారం ఏర్పాటు చేస్తే అది 'దక్షిణ ముఖద్వార గృహం' అవుతుంది.



దక్షిణ సింహద్వారం ఉచ్ఛస్థానంలో వుంటే శుభాలు కలిసివస్తాయి.

## పడమర ముఖద్వార గృహాలు

గృహానికి పడమరలో ప్రధాన ద్వారాన్ని ఏర్పాటు చేస్తే అది 'పడమర ముఖద్వార గృహం' అవుతుంది. ఆ గృహానికి పడమరలో ఉన్న గది లోపలి కొలతను సగం చేసి ఉత్తరం వైపు వచ్చే సగ భాగంలో ప్రధాన ద్వారం ఏర్పాటు చేసుకోవటం మంచిది. పడమర సింహద్వారం ఉచ్ఛస్థానంలో వుంటే అభ్యున్నతినిస్తుంది.

## ఉత్తర ముఖద్వార గృహాలు

గృహానికి ఉత్తర భాగంలో ప్రధాన ద్వారం ఏర్పాటు చేస్తే అది 'ఉత్తర ముఖద్వార గృహం' అవుతుంది. ఆ గృహానికి ఉత్తరాన ఉన్న గది లోపలి కొలతను సగం చేసి తూర్పు వైపు వచ్చే సగ భాగంలో ప్రధాన ద్వారాన్ని ఏర్పరచుకోవడం ఉత్తమం.

ఉత్తర సింహద్వారం ఉచ్ఛ స్థానంలో వుంటే కలిసివస్తుంది.



వచ్చింది. ఓ హోటల్ గదిలో బస చేసింది. అయితే ఆమె తెచ్చుకున్న వస్తువులన్నీ ఎవరో దోచుకుపోయారు. ఆమె ఓ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆ దొంగ కోసం వెతుకుతున్నారనేదే ఆ వార్త. ఇలా చెప్పడం వల్ల మన దేశంలో ఉన్నవారందరూ దుర్మార్గులనో, విదేశాలలో ఉన్న వాళ్లందరూ

# మనలోనే మంచోడూ, చెడ్డోడూ ఉంటారు

మన ఊరికి చెందిన ఓ మనిషి జపానుకి వెళ్లాడు. అక్కడ ఓ వంతెన మీద నడుచుకుంటూ పోతున్నాడు.
ఆ సమయంలో ఉన్నట్టుండి వర్షం.. క్రమంగా పెద్దదవుతోంది. వంతెన మీద పోతుండటం వల్ల తల దాచుకునే అవకాశం లేదు.
వంతెన మీదున్న అతను ముందుకు పోవాలా లేక వెనక్కు తిరిగొచ్చెయ్యాలా అని ఆలోచించాడు. అయితే బయలుదేరిన చోట దగ్గరగా ఉండటంతో అతను వెనుతిరిగి నడవసాగాడు.
ఆ సమయంలో ఆ మార్గంలో వేగంగా పోతున్న ఓ కారు ఆకస్మికంగా బ్రేక్ వేసి ఆగింది. అనంతరం ఆ కారు వెనక్కు నడిచింది. కారు అతని దగ్గరకు వచ్చి ఆగింది. అతనికేమీ అర్థం కాలేదు.
కారు నడుపుతున్న ఓ వ్యక్తి తలుపు తీసి అందులోంచి కిందకు దిగాడు.
అతను జపనీయుడు. అతనికి నలభై ఏళ్లు ఉండొచ్చు. ప్లీజ్ టేక్.. అని ఏదో చాచాడు.
వర్షం జోరుగా కురుస్తున్న సమయమవడంతో అతనేమిస్తున్నాడో మన ఊరు మనిషికి సరిగ్గా తెలీలేదు. అతనిచ్చినదానిని మన మనిషి తీసుకున్న మరుక్షణం జపనీయుడు కారెక్కి వేగంగా వెళ్లిపోయాడు.
ఆ తర్వాతే మన ఊరు మనిషి తానందుకున్నది చూశాడు. అదొక అందమైన గొడుగు. అతనికి ఆ సమయంలో ఏది అవసరమో అదే ఇది. అప్పుడతను ఇలా అన్నాడు..
"నాకేదైతే అవసరమో దానిని ఓ అపరిచితుడు ఇవ్వడం ఊహాకందనిది, మాటల్లో చెప్పలేనిది. ఆ మనిషి కల్పించిన ఆశ్చర్యంతోనూ ఆనందంతోనూ ఆ గొడుగును విప్పి వేసుకోవాలనే ధ్యాస కూడా రాలేదు. అతనినే ఊహిస్తూ ఆలోచనలో పడ్డాడు.
ఓ మనిషి తన దేశం విలువను, సంస్కృతిని నా చేతికి ఇచ్చినట్లనిపించింది. ఆ మనిషి నాకిచ్చిన గొడుగుతో నాకు సాయం చేయడం కాదు. తన దేశానికి చేసిన సాయమనుకున్నాడు. అనంతరం మన ఊరిమనిషి చేతిలో ఉన్న గొడుగు విచ్చుకుంది.
అతను ఆ గొడుగునెంతో జాగ్రత్తగా దాచుకున్నాడు. మన దేశానికి తిరుగు ప్రయాణం చేసిన తర్వాత తన మిత్రుడితో ఈ సంఘటనను చెప్పి ఆనందించాడు.
వారిద్దరి మధ్య జరిగిన సంఘటన నాకు జ్ఞాపకానికి రావడానికి కారణం.. జపానుకి వెళ్లి వచ్చిన మనిషి నా మిత్రుడికి మిత్రుడై ఆ విషయం నా వరకూ రావడమే. కొన్ని రోజుల క్రితం ఓ పత్రికను చూడటమే అందుకు కారణం.
ఓ విదేశీ వనిత మన దేశానికి వచ్చింది. దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించడానికి ఆమె భారతదేశం

ఉత్తములనో అర్థం కాదు.
ప్రతి దేశంలోనూ మంచివారూ ఉంటారు, అలాగే చెడ్డవారూ ఉంటారు. అంతేతప్ప ఇక్కడ ఉంటారు, అక్కడ ఉండరని అర్థం కాదు.
ప్రతి మనిషిలోనూ మంచోడు ఉంటాడు. అలాగే చెడ్డోడూ ఉంటాడు. తనలోని దుష్టత్వాన్ని తలెత్తకుండా అణచిపెట్టి ఉంచడం మంచివాడి కనీస బాధ్యత. ఈ రోజుల్లో ప్రపంచంలో మంచివారి సంఖ్యే అధికం. కానీ వారి గురించి వార్తలు బయటకు రావు. చెప్పుకోవడమూ తక్కువే. దాంతో మంచివారి సంఖ్య తక్కువని అనుకోవడం జరుగుతుంటుంది.
దొంగిలించాడన్న విషయమే వార్తగా వస్తుంది. దొంగతనం చేయలేదన్న విషయం వార్తగా రాదుగా.
ప్రపంచ ప్రసిద్ధి చెందిన హాస్యనటుడు బాబ్ హోప్ ఓమారు ఇటలీకి వెళ్లారు. అక్కడ పర్యటించి అనేక ప్రదేశాలు చూడాలనుకున్నారు. ఆ ఉద్దేశంతోనే అక్కడి పర్యాటక శాఖ ప్రచురించిన ఓ పుస్తకాన్ని కొనుక్కున్నారు. ఓ టూరిస్ట్ గైడుని కలిశారు.
"అయ్యా, నేనీ దేశంలో కొన్ని ప్రధాన ప్రదేశాలను చూడాలనుకుంటున్నాను. మీరు సహాయం చేస్తారా?" అని అడిగారు ఆ నటుడు టూరిస్ట్ గైడుని.
"తప్పకుండా" అన్నాడు టూరిస్ట్ గైడ్.. "నా పని అదే కదండీ" అని కూడా చెప్పాడు.

నటుడికి సంతోషమేసింది.
"నేను మీకు సాయం చేస్తాను. కానీ ఓ చిన్నపాటి నిబంధన" అన్నాడు టూరిస్ట్ గైడ్.
"ఏమిటది? చెప్పండి" అన్నారు నటుడు.
"నేను మీకు ఊరు చూపిస్తాను. కానీ మీరు ఆ సమయంలో పుస్తకాన్ని చూడకూడదు" అన్నాడు టూరిస్ట్ గైడ్.
అతనలా చెప్పడంతో ఈ నటుడికి అనుమానమేసింది. అతనితో వెళ్లడం సరికాదనుకున్నారు. మరొక టూరిస్ట్ గైడుని కలిశారు.
అయితే అతనూ అదే షరతు విధించాడు.
దాంతో మరో దారి లేకపోయింది నటుడికి ఆ రెండో టూరిస్ట్ గైడుతో పాటు వెళ్లారు.
ముఖ్యమైన ప్రదేశాలన్నీ చూపించేసిన టూరిస్ట్ గైడ్ చివర్లో నటుడి నుంచి అయిదు వందల రూపాయలు తీసుకున్నాడు ఆ ఊరి డబ్బులో.
నటుడు బాబ్ హోప్ తాను బస చేసిన హోటల్ గదికి వచ్చి తాను కొనుక్కున్న పుస్తకాన్ని తిరగేశారు.
టూరిస్ట్ గైడ్ ఎందుకు ఈ పుస్తకం చూడకూడదని చెప్పారో, పుస్తకంలో ఉన్న విషయాలనే కదా అతనూ చెప్పాడు. ఎక్కడా ఏదీ మార్చి చెప్పలేదు.
మరెందుకు.. ఆ టూరిస్ట్ గైడ్ ఈ పుస్తకాన్ని చూడకూడదని షరతు విధించాడు అనుకుంటూ ఆ పుస్తకం ఆఖరి పేజీ తిప్పారు. అప్పుడు ఆయనకు అసలు విషయం బోధపడింది.
ఆ పేజీలో ఇలా రాసి ఉంది: "టూరిస్ట్ గైడ్ మీకు సాయం చేసినందుకు అతనికి యాభై రూపాయలు ఇస్తే చాలు" అని ఆఖరి పేజీలో రాసి ఉంది.

**- యామిజాల జగదీశ్**

---

**(జి20 సారథి భారత్)**

**(11వ పేజీ తరువాయి)**

దానితో పాటు ఉగ్రవాదానికి నిధులందించే కార్యకలాపాల కట్టడికి దేశాలన్నీ కలిసి రావాలని పిలుపు ఇవ్వడంతో పాటు మనీ లాండరింగ్‌ను నిరోధించగలిగే ప్రతిష్టాత్మక విధానాలను రూపొందించి సభ్యదేశాలచే ఒప్పించగలగాలి. ప్రజలకు మెరుగైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, సుసంపన్న భూగోళానికి ఈ కూటమి హామీ ఇవ్వడంతో పాటు సమకాలీన సవాళ్లను పరిష్కరించడంలో ఆచరణ యోగ్యమైన విధానాలను రూపొందించడంలో చిత్తశుద్ధి చూపగలగాలి. ఉక్రెయిన్ యుద్ధం వల్ల అమెరికా-ఈయూ, రష్యా-చైనా కూటముల మధ్య వైరం ముదురుతున్నందువల్ల శాంతి సామరస్యాల కోసం అవిరళ కృషి చేయాలి.
హరిత అభివృద్ధి, డిజిటల్ రూపాంతరీకరణ, మహిళా కేంద్రిత అభివృద్ధి, పట్టణ మౌలిక వసతుల విస్తరణలకు జీ20 ప్రాధాన్యమిచ్చేలా భారత్ చర్యలు తీసుకోగలగాలి. శిలాజ ఇంధనాల వాడకాన్ని కట్టడి చేసి వాతావరణ మార్పుల నిరోధానికి భారత్ మార్గదర్శకత్వం వహించాలి. వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను ఎదుర్కొని హరిత ఇంధనాల వైపు పురోగమించడం కోసం వర్ధమాన దేశాలకు నిధులు సమకూరుస్తామని సంపన్న దేశాల వాగ్దానం చేశాయి. ఆ హామీని కూడా సక్రమంగా అమలయ్యేలా జీ20 అధ్యక్ష హోదాలో భారత్ చర్యలు తీసుకోవాలి. పన్నుల విధానంలో సంస్కరణలు చేపట్టి, విశాల ప్రయోజనాలే ప్రాతిపదికగా ముందడుగు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశాల మధ్య పెట్టుబడుల ప్రవాహానికి వీలు కల్పించే ద్రవ్య విధానాల రూపకల్పనపై కూటమి దృష్టి సారించాలి. రుణభారంలో కూరుకుపోయిన 70 దేశాలను సముద్ధరించడానికి, కొవిడ్ వల్ల దుర్భర దారిద్ర్యంలోకి జారిపోయిన కోట్ల మందికి చేయూత ఇవ్వడానికి, వాతావరణ మార్పుల నిరోధానికి ఇండియా కృషి చేయాలి.
'కాప్' వాతావరణ సదస్సులో ప్రధాని మోడీ.. 2070 కల్లా కర్బన ఉద్గారాల విడుదల, వాటి తగ్గుదల సమానంగా ఉండేలా నెట్ జీరో లక్ష్యాన్ని సాధిస్తామని ప్రకటించారు. 2030 కల్లా పునరుత్పాదక ఇంధన వనరులతో 500 గిగా వాట్ల విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని సంపాదిస్తామన్నారు. కర్బన ఉద్గారాలను 100 కోట్ల టన్నుల మేర తగ్గిస్తామని చెప్పారు. సగందాకా ఇంధన అవసరాల కోసం పునరుత్పాదక వనరులపైనే ఆధారపడతామన్నారు. ఈ లక్ష్య సాధనకై భారత ఆర్థిక వ్యవస్థలో కర్బన వినియోగం 45 శాతానికి మించకుండా జాగ్రత్త పడతామని వెల్లడించారు. వీటి కార్యాచరణలో జీ20 కూటమి అధినేతగా నరేంద్ర మోడీ ప్రపంచ ఆర్థిక సంస్థల సంస్కరణలను కోరవచ్చు. దీనితోపాటు వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్ లాంటి సంస్థల నియమ నిబంధనలను అమలు చేస్తూ జీ20 దేశాల అభివృద్ధి అనుకూలంగా సరళీకృతం చేసి సరికొత్త సంస్కరణలు చేపట్టడం ద్వారా ఆర్థికంగా జీ20 దేశాలకు ప్రత్యేకించి అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్‌కు మేలు చేకూరే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ పైన తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ సమయంలో పరిస్థితులను పూర్వ స్థితికి తీసుకురావడం అనేది భారత్‌కు చిన్న విషయం కాదు. దానితో పాటు ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం చేస్తున్న తరుణంలో రష్యా పైన విధించిన ఆంక్షలపై జీ20 కూటమిలోగల సభ్యదేశాలే రెండుగా చీలిపోవడం చూస్తే కూటమిలో ఏకాభిప్రాయం లేదనే స్పష్టం అవుతూ ఉంది.
ఒక పక్క దౌత్యపరంగా భారత్ అభివృద్ధి చెందిన దేశాలయిన యూఎస్, యూకే, యూరోపియన్ యూనియన్, జపాన్, సౌత్ కొరియాల సరసన చేరాలని భారత్ భావిస్తోంది. అదే సమయంలో రష్యాతో వాణిజ్య సంబంధాలను కొనసాగించాలన్న సంకల్పంతో ఉంది.
అలాగే ప్రపంచ నవకల్పనల సూచీలో కూడా భారత్ అగ్రభాగాన ఉండటం అభినందనీయం. కానీ పేదరికపు సూచి, ఆకలి సూచి, మానవాభివృద్ధి సూచికలు వంటి వాటి విషయంలో ఇంకా ఆక్షేపణీయ స్థితిలోనే మనం ఇంకా కొనసాగుతున్నాం. ఈ స్థితిని అధిగమించే స్థితికి భారత్ చేరుకోవాలి.
దానికి భారత ప్రధాని పరిపాలనా దక్షతను ఉపయోగించి ప్రపంచ పటంలో భారత్ ఖ్యాతిని ఇనుమడింప చేయగలగాలి. ఇదే సమయంలో జీ20 కూటమి అధ్యక్ష హోదాలో ఉన్న భారత్‌కు మద్దతు ఇవ్వడానికి, కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని అగ్రరాజ్యం అమెరికా కూడా పేర్కొనడం ఆహ్వానించదగ్గ విషయం.
ఈ తరుణంలో మన లక్ష్యాల తీరును సమీక్షించుకుంటూ దేశాలు, ప్రజల మధ్య సమ్మిళితాన్ని ప్రోత్సహించే చరిత్రాత్మక అవకాశం దక్కిన మనం సంపూర్ణంగా దానిని ఉపయోగించుకోగలిగితే కూటమి శిఖరాగ్ర సదస్సుల నిర్వహణలో భారత్‌కు ప్రపంచ కీర్తి స్వంతం అవుతుంది. ■



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



వారమంతా ఉత్సాహంగా గడుస్తుంది. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. స్త్రీలకు ఆరోగ్య సమస్యలు. వృధా ఖర్చులను నియంత్రిస్తారు. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభిస్తారు. కాలానుగుణంగా వ్యాపారం చేసేవారికి ఆశించిన ఫలితాలుంటాయి. కుటుంబ బాధ్యతలు తీరుతాయి.



## వృషభం

పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. అదనపు ఆదాయం లభిస్తుంది. ఖర్చులు కూడా అలాగే ఉంటాయి. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. హోల్ సేల్ వ్యాపారులకు ఆశించిన ఫలితాలు రాకపోవచ్చు. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి.

## మిథునం



అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. ప్రతికూలతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలించే సూచనలున్నాయి. వృద్ధుల ఆరోగ్య విషయంలో శ్రద్ధ కనబరుస్తారు.



## కర్కాటకం

ప్రముఖులతో పరిచయం ఏర్పడుతుంది. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. అకారణంగా మానసిక ఆందోళనకు లోనవుతారు. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. శుభ కార్యాలకు హాజరవుతారు. డ్రైవింగ్‌లో మెళకువలు నేర్చుకుంటారు. ఉద్యోగాభివృద్ధి సంతృప్తినిస్తుంది. చోర భయం పొంచి వుంది. ప్రయాణాల్లో జాగ్రత్త.

## సింహం



అందరూ మీ మాటే వేదవాక్కులా ఆచరిస్తారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. క్రయ-విక్రయాలు లాభసాటిగా ఉంటాయి. ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండండి. ఉద్యోగులకు సహోద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది. ఎదురు చూస్తున్న శుభ వర్తమానం వారాంతంలో తెలుస్తుంది. మీ మంచితనమే మీకు శ్రీరామ రక్ష.



## కన్య

ఏది జరిగినా అంతా మన మంచికే.. అన్న ధోరణి ఏర్పడుతుంది. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. చిరకాల కోరిక వారాంతంలో తీర్చుకుంటారు. వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు లభిస్తాయి. విద్యార్థులకు పోటీ పరీక్షల్లో విజయం లభిస్తుంది. గృహ ప్రాప్తి.

## తుల



సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. దూరపు బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది. ఆరోగ్య సమస్యలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకండి. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. ప్రయాణ సూచనలున్నాయి.



## వృశ్చికం

కళాకారులకు సన్మాన యోగం. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలన సూచనలున్నాయి. భాగస్వామ్య వ్యాపారులకు లాభదాయకం. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది.

## ధనుస్సు



అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరిస్తారు. తాహతుకు మించిన రుణాలు చేయడం సముచితం కాదు. జీవిత భాగస్వామి ద్వారా స్థిరాస్తి కలిసొస్తుంది. పోయాయి.. అనుకున్న వస్తువులు తిరిగి లభిస్తాయి. సహోద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది. మీ శక్తి సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. వృత్తి ఉద్యోగాల్లో వున్నవారికి బాగుంటుంది. విదేశాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం తెలుస్తుంది.



## మకరం

స్త్రీలకు శుభ యోగం. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. వ్యవసాయదారులకు బాగుంటుంది. వివాదాలకు దూరంగా వుంటే మరిన్ని మంచి ఫలితాలు పొందుతారు. ఆదాయానికి మించిన ఖర్చులున్నా ఏదో విధంగా సర్దుబాటు చేసుకుంటారు. ప్రభుత్వ సంబంధమైన పనులు వాయిదా పడతాయి. కోర్టు వ్యవహారాలు సానుకూలంగా వుంటాయి. సాహస యాత్రలు చేయాలన్న కోరిక తీరే సూచనలు అధికం.

## కుంభం




ఆరోగ్యం కుదుట పడుతుంది. ఉద్యోగులకు పదోన్నతి. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. వృధా ఖర్చులను నియంత్రించడంలో విఫలమవుతారు. పాపకార్య చింతన మంచిది కాదని గ్రహిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. శుభ కార్యాలకు హాజరవుతారు. తీర్థ యాత్రలు చేస్తారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు.



## మీనం

ప్రముఖులతో పరిచయం ఏర్పడుతుంది. ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం అసహనం కలిగిస్తుంది. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. స్త్రీలకు స్థిరాస్తులు కలిసొస్తాయి. సొంతింటి కల నెరవేరే సూచనలున్నాయి. విదేశాల్లో వున్న ఆత్మీయుల నుండి ముఖ్యమైన సమాచారం తెలుసుకుంటారు.





# మనసు దోచే సరస్సులు

**శీతాకాలంలో** ఎక్కడికైనా ట్రావెల్ చేస్తే ఎంతో అద్భుతంగా ఉంటుంది. ప్రశాంతంగా ఉంటుంది. మనం చేసే పని నుండి బ్రేక్ దొరుకుతుంది. మరి శీతాకాలంలో ఏదైనా ట్రిప్ వేయాలనుకునేవారు ఈ సరస్సులను చూసి వచ్చేయండి. కుటుంబంతో వెళ్లినా, స్నేహితులతో వెళ్లినా ఈ సరస్సులు పర్ఫెక్ట్ అని చెప్పొచ్చు.

## కశ్మీర్ దాల్ లేక్

కశ్మీర్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. శ్రీనగర్‌లోని దాల్ లేక్ చూడవచ్చు. ఇందులో బోటింగ్ కూడా చేయవచ్చు. కనుక ఇక్కడికి ప్లాన్ చేసుకోవచ్చు.

## వెంబనాడ్ లేక్

కేరళలోని వెంబనాడ్ లేక్ కూడా చూడాల్సిందే. సుమారు 100 కిలోమీటర్ల పరిధిలో ఇది విస్తరించి ఉంది. కేరళలోని టూరిస్టు అట్రాక్షన్స్ లో ఇది మొదటి స్థానంలో వుంది. ఫ్యామిలీతోగానీ ఫ్రెండ్స్ తోగానీ వెళితే బాగా ఎంజాయ్ చేయవచ్చు.



సిక్కిం సాంగో లేక్

## సిక్కిం సాంగో లేక్

గ్యాంగ్‌టాక్‌కు సుమారు నలభై కిలోమీటర్ల దూరంలో వుందీ సరస్సు. ఇది కూడా చాలా అందంగా ఉంటుంది. రెండు హిమాలయాల నడుమ ఉందీ సరస్సు. ఈ సరస్సులో నీళ్ల కూడా స్వచ్ఛంగా ఉంటాయి.

## పిచోలా సరస్సు

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఎన్నో అందమైన సరస్సులు వున్నాయి. ఉదయ్‌పూర్‌ను సరస్సుల నగరంగా పిలుస్తారు. ఈ సరస్సును ఎనిమిది వందల సంవత్సరాల క్రితం నిర్మించారు. ❒



కేరళ వెంబనాడ్ లేక్





సింగిల్ పేజీ కథ

# స్నేహ బంధం

కొప్పల కాశీ విశ్వేశ్వర రావు

**ఒకే** చోట వరుసగా మూడు పోర్షను లుగా ఉన్న ఇళ్లను అమ్ముతున్నట్లుగా తెలిసి, ఒకే కంపెనీలో పని చేస్తున్న ముగ్గురు స్నేహితులు ఆ ఇళ్లు కొనడానికి సిద్ధమయ్యారు.

మూడు పోర్షన్లకు ఇంటిముందర ఆరు అడుగుల వెడల్పు ఉన్న ఖాళీ స్థలం, ముగ్గురికి రాకపోకలకు కామన్ రహదారిగా ఉన్నాయి ఆ ఇళ్లు.

మనలో మనకు బేధాభిప్రాయాలు ఉండకూడదని భావించి, ముగ్గురిలో ఒకరైన మోహనరావు "లాటరీ పద్ధతిలో ఎవరికి ఏ పోర్షన్ వస్తే ఆ విధంగా పంచుకుని రిజిస్ట్రేషన్ చేసుకుందాం" అని అనేసరికి–

మిగతా ఇద్దరూ "సరే" నన్నారు.

ఒక మంచి రోజున సతీసమేతంగా ఒక దగ్గర కూర్చుని అంకెలు రాసి చీటీలు తీయగా, సలహా చెప్పిన మోహనరావుకు మొదటి పోర్షను, రెండవది రామారావుకు, మూడవ పోర్షను క్రిష్ణకు రాగా– ఆ ప్రకారంగానే రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు.

సొంత ఇంటికల నెరవేరిందన్న ఆనందంతో ఐకమత్యంగా ఉంటున్నారు.

కొద్ది రోజుల గడిచిన తరువాత మూడవ పోర్షన్‌లో ఉంటున్న క్రిష్ణ తన ఇంటికి మంచినీటి కుళాయి వేయించుకున్నాడు. ఆ కుళాయినీటిని మిగతా రెండు పోర్షన్‌లలో ఉంటున్న మోహనరావు, రామారావుల భార్యలు అప్పుడప్పుడూ పట్టుకుని వెళ్తుండేవారు.

ఒకరోజు క్రిష్ణ ఇంటికి వచ్చిన బంధువు వారం రోజులు ఉండి వెళ్తూ వెళ్తూ "అమ్మాయ్! మీ ఇంటి కుళాయినీటిని పక్కవాళ్లు పట్టుకుని వెళ్తున్నారు కదా! మీకు మంచిది కాదు" అని చెప్పి బయలుదేరాడు.

బంధువు చెప్పిన విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు క్రిష్ణ దంపతులు.

రెండు నెలల తరువాత క్రిష్ణ చిన్న అత్తగారు చుట్టంచూపుగా వచ్చి మూడు రోజుల తరువాత ప్రయాణమవుతూ "బాబూ! క్రిష్ణా.. మీ కుళాయినీటిని పక్కపోర్షన్‌లో ఉంటున్నవారు తీసుకుని వెళ్లకూడదు" అంది.

ఆవిడ కూడా అలా చెప్పేసరికి క్రిష్ణ దంపతులు ఆలోచనలో పడి, మరికొంత మందిని సంప్రదించగా–

"మీరు తూర్పు ఈశాన్యంలో ఉన్నారు, వాళ్లు పడమర వైపున ఉన్నందున మీ ఇంటికి వచ్చిన బంధువులు మీ మంచి కోసమే చెప్పారు" అని అన్నారు.

బాగా ఆలోచించి, వారం తిరిగేసరికి క్రిష్ణ తన ఇంటి సరిహద్దుకు ఇనుప గ్రిల్ పెట్టించి తాళం వేసాడు.

అది చూసిన పక్క పోర్షన్‌వాళ్లు కుళాయినీటి కోసం క్రిష్ణ ఇంటికి రావడం మానేసారు.

అలా కొన్ని రోజులు గడిచిన తరువాత మొదటి పోర్షన్‌లో ఉంటున్న మోహనరావు వాడుతున్న స్కూటరు చెడిపోవడం వల్ల తన ఇంటిముందున్న దారిలో పార్కు చేసి కంపెనీకి బస్సులో వెళ్తుండేవాడు.

మరికొన్ని రోజులకు మధ్య పోర్షన్‌లో ఉంటున్న రామారావు భార్య ఇల్లు శుభ్రంగా వుండాలని పాడైపోయిన సైకిలు, విరిగిన కుర్చీ, బెంచీలు, వాడని రుబ్బురోలు ఇంటిముందర నడిచే దారిలో పెట్టింది.

దాని వల్ల రెండు పోర్షన్‌లు దాటుకుని క్రిష్ణ తన ఇంటికి వెళ్లడానికి ఇబ్బంది పడినా సరే క్రిష్ణ దంపతులు ఎవ్వరినీ ఏమీ అనేవారు కాదు.

ఒకరోజు మధ్య పోర్షన్‌లో ఉంటున్న రామారావు భార్యకు అర్ధరాత్రివేళ కడుపునొప్పి వచ్చి, ఎంతకూ తగ్గకపోగా, ఆస్పత్రికి తీసుకువెళ్లడానికి ఆటోని పిలిచాడు.

"లోపలికి రావడం కుదరదని" వెళ్లిపోయాడు ఆటోవాడు.

రిక్షావాడిని పిలిచాడు.. "దోవలో అడ్డంగా చెత్తా చెదారం ఉంది లోపలికి వస్తే నా రిక్షాటైర్లు పాడైపోతాయని" రిక్షావాడు కూడా రాలేదు.

అది చూసిన క్రిష్ణ "తన స్కూటరు మీద మీ భార్యను ఆస్పత్రికి తీసుకువెళ్లమని" స్కూటరు తాళాలు రామారావుకు ఇచ్చాడు.


వారం రోజుల తరువాత ఆరోగ్యంగా ఆస్పత్రి నుండి వచ్చిన రామారావు భార్యకు ఇంటిముందర ఆరు అడుగుల రహదారి, చెత్తాచెదారం లేకుండా ఎంతో విశాలంగా కనిపించడమే కాకుండా అక్కడక్కడా పెట్టిన పూలకుండీలు అందంగా కనిపించేసరికి ఆనందంతో తన ఇంటిగడప దాటి లోపలికి వెళ్తుండగా క్రిష్ణ ఇంట్లోని టీవీలో నుండి 'స్నేహబంధమూ ఎంత మధురమూ' సినిమా పాట వినిపించేసరికి సిగ్గుపడిన రామారావు భార్య పశ్చాత్తాపం చెంది "ఏమండీ! మనం కూడా కుళాయి పెట్టించుకుందాం, రేపే అప్లికేషన్ పెట్టండి" అని రామారావు భార్య అనేసరికి–


రామరావు భార్య మాటలు విన్న మోహనరావు భార్య కూడా "మనం కూడా కుళాయి వేయించుకుందాం" అని ఇంటిముందర పనికిరాని వస్తువులను అమ్మివేసి దారిని శుభ్రం చేస్తూ అంది.


జరిగిన సంఘటనలను తలచుకుంటూ అందరూ హాయిగా నవ్వుకున్నారు. ◆




ఈ వారం కా'ర్ట్యూన్స్'


నీవీ సీట్లో ఉన్నపుడు నా ఏరియర్స్ బిల్లులో
పది శాతం తీసుకున్నావ్..గుర్తుందా..?!
ఏరియర్స్ బిల్లు
బిల్లుల సెక్షన్
Zakir...


గొప్ప గొప్పోళ్ళ అడుగుజాడల్లోనే
నడుద్దామని చూస్తా..కానీ కనిపించవే...!
Zakir...


ఎవరి ఎముకలకు
వారే బాధ్యులు
Zakir...



ఫోటో ఫీచర్

నీటిపై
తేలే ఈ నగరం
ప్రపంచంలోనే మొదటిదిగా పేరు
పొందింది. ఈ నగరం దక్షిణ
కొరియాలో ఉంది. జనావాసానికి
అనుకూలమైన ఈ నగరం
పేరు ఓషియానిక్స్.



